

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

- అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ ఆదేశం

గద్వాల, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిబంధనల మేరకు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 32 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగరావులకు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు బాధ్యతతో పరిశీలించాలని సూచించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణికి 58 దరఖాస్తులు

- ప్రజల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 21 (వుదయం ప్రతినిధి):



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరం పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు.సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయంతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నేటి ప్రజావాణికి మొత్తం 58 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సీఎం ప్రజావాణి ద్వారా జిల్లాకు అందుతున్న వినతులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత శాఖకు పంపించి, తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వినతుల పురోగతి, పరిష్కార వివరాలను ఫోన్ ద్వారా అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో కారణాలను స్పష్టంగా పేర్కొంటూ నివేదిక రూపొందించి తెలియజేయాలన్నారు. ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డైరెక్టర్ ఎన్నికల్లో టి.ఎన్.జి.ఓ.యూనియన్ అధికారిక ప్యానెల్ ఘన విజయం

హైదరాబాద్:



TNGOs MACH Society Ltd., Gachibowliలో ఖాళీ అయిన రెండు డైరెక్టర్ పదవులకు నిన్న జరిగిన ఎన్నికల్లో TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్ అభ్యర్థులు శ్రీ కారం రవీందర్ రెడ్డి మరియు శ్రీ కట్కూరి శ్రీకాంత్ విజయం సాధించారు.

మొత్తం 2,107 మంది సభ్యులకు గాను 867 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 7 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి.

శ్రీ కారం రవీందర్ రెడ్డి - 583 ఓట్లు

శ్రీ కట్కూరి శ్రీకాంత్ - 302 ఓట్లు

ఎన్నికల అధికారి శ్రీ మోహన్ రావు గారు ఇరువురిని విజేతలుగా అధికారికంగా ప్రకటించారు.ఎన్నికల సందర్భంగా శ్రీమతి ఉమాదేవి, శ్రీ గోవర్ధన్ రెడ్డి గారు TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్‌కు మద్దతుగా తమ అభ్యర్థిత్వాన్ని విరమించుకోవడం విశేషం.ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను శ్రీ కె. స్వామిగౌడ్, శ్రీ సుధాకర్, శ్రీ దేవిప్రసాదరావు, శ్రీ మీమిళ్ల రాజేందర్, శ్రీ మారం జగదీశ్వర్, శ్రీ ముజీబ్, శ్రీ ఎం.ఎ. హమీద్ తదితరులు అభినందించారు.

# ఆలయాల్లో ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దంపతుల ప్రత్యేక పూజలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం

అలంపూర్, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)



ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆనంద్ బర్ధన్ దంపతులు సోమవారం అలంపూర్‌లోని ప్రసిద్ధ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంపూర్‌కు చేరుకున్న ఆయన దంపతులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆలయ అధికారులు మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, మేళతాళాల మధ్య బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలోకి తీసుకెళ్లారు. ముందుగా విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్న ఆనంద్ బర్ధన్ దంపతులు అనంతరం బాల బ్రహ్మేశ్వర స్వామివారి అభిషేక పూజల్లో పాల్గొన్నారు. తదుపరి జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అలంపూర్ క్షేత్ర మహత్యం, ఆలయాల విశిష్టతను వారికి వివరించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తిరెడ్డి, అలంపూర్ తహసీల్దార్ ప్రభాకర్, ఆలయ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి 675పై ఘోర ప్రమాదం యువకుడి మృతి





- శ్రీశైలం-హైదరాబాద్ ఘాట్ రోడ్డులో అదుపుతప్పి బోల్తా పడ్డ క్లూజర్ వాహనం

అచ్చంపేట, సెప్టెంబరు 21 (వుదయం ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం శ్రీశైలంహైదరాబాద్ జాతీయ రహదారి 675 ఘాట్ రోడ్డుపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.బ్రహ్మగిరి (దోమల పెంట) గ్రామం ఆక్టోపస్ సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న క్లూజర్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని పల్టీలు కొడుతూ బోల్తా పడింది.ఈ ప్రమాదంలో క్లూజర్ లో ప్రయాణిస్తున్న యువకుడు స్థలంలోనే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. పలువురి పరిస్థితి విషమంగా ఉండగా, మహిళలు, పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాద విషయం తెలుసుకున్న పెట్రోలింగ్ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది, ఇతర యాత్రికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వాహనాల ద్వారా సమీప ఆసుపత్రికి తరలించారు.మృతులు, క్షతగాత్రులు మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన వారిగా ప్రాథమికంగా తెలుస్తోంది. వీరు శ్రీశైలం దైవదర్శనం పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్ కు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘాట్ రోడ్డులో వాహనం అదుపు తప్పడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదంపై పోలీసులు, అటవీశాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# ప్రజావాణిలో 10 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



- ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఆదేశం

గద్వాల, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర న్యాయం అందించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 10 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి**

ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనివల్ల ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత నమ్మకం, భరోసా పెరుగుతుందని పేర్కొన్నారు.

**భూ వివాదాలపై అధికంగా ఫిర్యాదులు**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

సోమవారం అందిన 10 ఫిర్యాదుల్లో ప్లాట్ల ఆక్రమణకు సంబంధించి ఒకటి, భూ వివాదాలకు సంబంధించి ఆరు, భర్త వేధింపులకు సంబంధించి ఒకటి, ఇతర అంశాలకు సంబంధించి రెండు ఫిర్యాదులు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

# గణేష్ గడ్డపై భక్తజన సంద్ర

- 8వ రోజు 'శ్రీ అన్నపూర్ణేశ్వరి' రూపంలో సిద్ధి గణపతి దర్శనం!
- భక్తుల కష్టాలు తీర్చే గణపయ్య.. 108 ప్రదక్షిణలతో వెల్లువెత్తిన మొక్కులు
- ఈవో లావణ్య గారి నిరంతర నిఘా, పర్యవేక్షణ.. భక్తులకు సకల సౌకర్యాలు
- ఆకలి తీర్చే అన్నప్రసాదం.. నిరంతరాయంగా కొనసాగుతున్న అన్నదానం
- ఆధ్యాత్మిక శోభతో పునీతమైన రుద్రారం పుణ్యక్షేత్రం
- రుద్రారం (ఇస్నాపూర్ మున్సిపాలిటీ):

సదాశివపేట సెప్టెంబర్ 21 (వు దయం):

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రుద్రారం శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నేడు సోమవారం 8వ రోజుకు చేరుకున్న మహోత్సవంలో ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారి కిటకిటలాడింది.

అన్నపూర్ణేశ్వరి అవతారంలో దర్శనం - 108 చుట్లతో భక్తుల మొక్కులు

కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారమైన సిద్ధి గణపతి నేడు 8వ రోజు విశేషంగా 'శ్రీ అన్నపూర్ణేశ్వరి' (అన్నపూర్ణేశ్వరుడి) దివ్య మంగళ స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షిస్తున్నారు. స్వామివారి చుట్టూ భక్తిశ్రద్ధలతో 108 చుట్లు (ప్రదక్షిణలు) వేస్తే సమస్త విఘ్నాలు తొలగి, సర్వాభీష్టాలు నెరవేరుతాయన్న విశ్వాసంతో భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు 108 ప్రదక్షిణలు పూర్తి చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించుకున్నారు.

ఈవో లావణ్య గారి ప్రతి క్షణం నిఘా - భక్తులకు కల్పవృక్షంలాంటి సేవలు

ఉత్సవాలకు పోటెత్తిన అశేష భక్తజనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారిణి (ఈవో) లావణ్య గారు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రతి క్షణం నిఘా ఉంచి, క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తూ భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిరంతరం పరిశీలిస్తున్నారు.

రద్దీని క్రమబద్ధీకరించే క్యూలైన్లు, పరిశుభ్రత, ఎండ తగలకుండా షామియానాలు, చల్లని తాగునీటి సరఫరా వంటి సకల సౌకర్యాలను స్వయంగా తనిఖీ చేస్తూ అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా అన్నపూర్ణేశ్వరి అవతారంలో ఉన్న గణపయ్య సన్నిధికి విచ్చేసిన ప్రతి ఒక్క భక్తుడికీ కడుపునిండా తృప్తికరంగా నిరంతర అన్నదానం అందేలా ఆమె ప్రత్యేక నిఘా ఉంచి ఏర్పాట్లను పక్కాగా అమలు చేస్తుండటం భక్తుల మన్ననలు పొందుతోంది.

**ఘనంగా పూజా కార్యక్రమాలు –**



**ప్రముఖుల హాజరు**

ఈ మహోత్సవ పూజా కార్యక్రమాల్లో ఈవో లావణ్య గారితో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రముఖులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, కె. సాయి గణేష్, ఎన్. సతీష్ కుమార్, ఎ. మురళి గౌడ్, ఎ. సంతోష్, ఎ. ప్రభు, టి. శివ రాములు, ఎ. రాజేష్ గౌడ్, ఎ. ముకుంద రెడ్డి, సి. నారాయణ రెడ్డి, డి. మహేష్, ఎ. కృష్ణ, ఆర్. శ్రీనివాస్, ఎం. భరత్ తదితరులు పాల్గొన్నారు. వేలాది భక్తుల 'గణపతి బప్పా మోరియా' జయజయధ్వానాలతో గణేష్ గడ్డ పరిసరాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి.



# కాట్రియాల్ లో మహిళా సంఘ భవనానికి భూమిపూజ

రామాయంపేట,సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి రాజాగౌడ్) :

రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సోమవారం సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. VBG RAM G (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్, (గ్రామీణ్) పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, సమావేశాలకు ఈ భవనం ఉపయోగపడనుంది .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారం తో మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సభవత్ బాబు,సెక్రటరీ ధనలక్ష్మి, పీఆర్ ఏఈ సల్మాన్ ఖాన్,వార్డు సభ్యులు,కట్ట చంద్రం, ద్యాగాల బాలయ్య,కాట్రియాల్ సిద్ధారంలు,ద్యాగాల ఎల్లం, ద్యాగాల రాజెల్లు,గొల్ల శ్రీశైలం, కాట్రియాల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- 800 మంది పోలీసులతో ---కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- డీజేలకు అనుమతి లేదు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)




జిల్లాలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**1,728 గణేష్ విగ్రహాలకు ఆన్‌లైన్ నమోదు, జియో ట్యాగింగ్...**

జిల్లాలో మొత్తం 1,728 గణేష్ విగ్రహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.దీని ద్వారా ప్రతి గణేష్ మండపం, విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతం, నిమజ్జనానికి సంబంధించిన వివరాలు పోలీసులకు ముందుగానే అందుబాటులో ఉండటంతో పాటు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

**డీజేలకు అనుమతి లేదు....**

గణేష్ శోభాయాత్రల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఆర్డీఓ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో డీజేలను నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 25 మంది రౌడీషీటర్లు, 77 మంది కమ్యూనల్ షీటర్లు, మరో 54 మంది ఇతర వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించడంతో పాటు గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు, యువత, మత పెద్దలతో పలు శాంతి సమావేశాలు నిర్వహించి శాంతియుతంగా పండుగను నిర్వహించడంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా జిల్లాలో సుమారు 800 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా అదనపు ఎస్పీ 1,డీఎస్పీలు 2,సీఐలు - 16,ఎస్సైలు 31,ఏఎస్ఐ,హెచ్‌సీలు 156,పోలీస్ కానిస్టేబుల్స్ 347, హోంగార్డులు - 116 టి జి పి ఎస్ ప్లటూన్లు 3 నియమించినట్లు ఆయన తెలిపారు. నారాయణపేట, ఉట్కూర్, మక్తల్, కోస్గి పట్టణాల్లో ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిస్థితులకు అనుగుణంగా వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

**సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా**

శోభాయాత్ర జరిగే మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా శోభాయాత్రను రికార్డు చేస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని చెప్పారు.నిమజ్జన ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజల భద్రతకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తాఖీ బాబా దర్గా ఉర్సు నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం, తాఖీ బాబా దర్గా ఉర్సు కార్యక్రమాలు ఒకే సమయంలో జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని, తమ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.ఎలాంటి వదంతులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుచిత పోస్టులను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించవద్దని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి....**

గణేష్ ఉత్సవాలు భక్తి, శాంతి, సోదర భావానికి ప్రతీకగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని ఎస్పీ తెలిపారు. ఈ పత్రిక సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, పాల్గొన్నారు.

# మూడు నోటీసులు.. చర్యలు ఎప్పుడు?

- అనుమతులు లేకుండానే భారీ ప్రహరీ గోడ నిర్మాణం
- నోటీసులిచ్చినా ఆగని పనులు.. చర్యలపై నిశ్శబ్దం.
- లంచాల మత్తులో అధికారులు

కొండాపూర్, వుదయం

నిబంధనలు బేఖాతర్.. నోటీసులు మాత్రం వరుసగా జారీ! కొండాపూర్ మండల పరిధిలోని మన్నాన్పల్లి గ్రామ శివారులో లక్ష్మారెడ్డిగూడ సమీపంలో అనుమతులు లేకుండా భారీ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టిన వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణానికి పంచాయతీ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**మూడు నోటీసులు.. అయినా ఆగని నిర్మాణం**

మన్నాన్పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 36, 37, 40 నుంచి 44 వరకు, 47 నుంచి 55 వరకు, 80 నుంచి 86 వరకు ఉన్న ప్రాంతాల్లో భారీ ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతున్నట్లు సమాచారం. నిర్మాణానికి పంచాయతీ అనుమతులు లేవని అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధితులకు ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసినా నిర్మాణ పనులు కొనసాగుతుండటంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**నోటీసులతోనే సరిపెట్టారా?**

అనుమతులు లేవని అధికారులే చెబుతున్న నేపథ్యంలో.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం కొనసాగుతున్నా తదుపరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడు నోటీసుల తర్వాత కూడా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయంటే అధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉందన్న చర్చ స్థానికంగా జరుగుతోంది.

**చర్యలు తీసుకుంటారా.. లేదా..**

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా.. "ప్రహరీ గోడకు ఎలాంటి అనుమతులు లేవు. ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేశాం. సోమవారం తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. దీంతో అధికారులు చెప్పినట్లుగా సోమవారం చర్యలు ఉంటాయా? లేక మరోసారి నోటీసులతోనే వ్యవహారం ముగుస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.

**ఎకరా విలువ రూ.5 కోట్ల వరకు?**

ఈ ప్రాంతంలో భూముల విలువ ఎకరాకు సుమారు రూ.5 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇంతటి విలువైన భూముల్లో జరుగుతున్న నిర్మాణంపై వచ్చిన ఆరోపణలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.మూడు నోటీసులు జారీ.. అనుమతులు లేవని అధికారుల ప్రకటన.. అయినా నిర్మాణం కొనసాగుతున్నట్లు ఆరోపణలు. ఇక సోమవారం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.





# విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదగాలి

- భవిష్యత్తులో బడుగు బలహీన వర్గాలకు సేవ చేయాలి: మాజీ సైనికుడు మైరాముడు
- ఎంబీబీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన విద్యార్థులకు ఘన సన్మానం

అయిజ, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



అయిజ పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడంతో పాటు మరో విద్యార్థి హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన సందర్భంగా మాజీ సైనికుడు ఇటిక్యాల మైరాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. పులికల్ ప్రభాకర్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో సత్యాన్వేష్, కళ్యాణ్ రాజ్, గీతిక ఎంబీబీఎస్ సీట్లు సాధించగా, వి. సువాబన్ హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికయ్యారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మైరాముడు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దళితులు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించడం విద్యార్థులు కష్టపడి చదివిన తీరుకు నిదర్శనమని, ఇది గర్వించదగ్గ విషయమన్నారు.భవిష్యత్తులో వైద్యులుగా స్థిరపడిన అనంతరం బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలని విద్యార్థులకు సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు. హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన సువాబన్ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్తులో సొంతంగా సంస్థలు స్థాపించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు దిశానిర్దేశం చేస్తూ ఉన్నత విలువలతో ముందుకు సాగేలా ప్రోత్సహించిన ప్రజాసంఘాల నాయకులకు, ముఖ్యంగా మాజీ సైనికుడు మైరాముడుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లల విజయాన్ని గుర్తించి సన్మానించడం మరింత ఉత్సాహాన్ని కలిగించిందన్నారు.కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభుదాసు, అలెగ్జాండర్, ప్రసంగి, ఇమ్మానేలు, బుచ్చన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్

కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. ముందుగా మండపంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొని స్వయంగా తన చేతులతో భక్తులకు అన్నదానం చేశారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని కోరారు. వినాయక విగ్రహాల నిమర్జనానికి జిల్లా యంత్రాంగం అన్ని అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసిందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, నిమర్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ.ఎ. నిర్మల,జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నరేందర్,ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లకు 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి

**జిల్లా వ్యవసాయ అధికారి జె. స్వరూప రాణి**

**సిద్దిపేట, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**



రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, ధాన్యం కొనుగోళ్లు, సబ్సిడీలు, పీఎం కిసాన్ మరియు రుణాలు పొందాలంటే రైతులందరికీ 'ఫార్మర్ ఐడీ' రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి జె. స్వరూప రాణి స్పష్టం చేశారు. ఈ ఐడీ నమోదు ద్వారా వివరాలు ఖచ్చితంగా నమోదై పారదర్శకత పెరుగుతుందని, ఒకే ఐడీ ద్వారా పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే జమ అవుతుందని ఆమె తెలిపారు. ఫార్మర్ ఐడీ నమోదు కోసం ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యేక క్యాంపులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు తమ పరిధిలోని ఏఈఓలను కానీ, లేదా సమీపంలోని మీసేవా కేంద్రాలను కానీ సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. మీసేవా కేంద్రాలలో రూ.15 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, అలాగే రైతు వేదికల లో ఏఈఓల ద్వారా పూర్తి ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సమయానికి రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ వివరాలు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా తెచ్చుకోవాలని కోరారు. ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌కు మెసేజ్ వచ్చిన వెంటనే రైతులు స్పందించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు.

# కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పరిశీలించారు

**మహబూబ్‌నగర్**



జిల్లాలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు దీర్ఘకాలిక అనారోగ్యం, ఇతర వైద్య కారణాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలుసుకున్న కలెక్టర్ వారిని నేరుగా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలుసుకొని వారి పరిస్థితి తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా మెడికల్ ఇన్వాలిడేషన్**

కేసులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని కలెక్టర్ జిల్లా వైద్య అధికారికి సూచించారు. అర్హత, వైద్య పరిస్థితి, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కమిటీ పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ నిర్ధారణైన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిబంధనల ప్రకారం ఉద్యోగం కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. కేసులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అర్హత నిజంగా అర్హుడా కాదా నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జడ్.పి. సి.ఈ.ఓ. ఇన్‌చార్జి డి. పి.ఓ. వెంకట్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



# కోయిల్ సాగర్ నీళ్లు వెంటనే విడుదల చేయాలని BRS పార్టీ ధర్నా రాస్తారోకో

**మరికల్ సెప్టెంబర్ (21 వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలో సోమవారం BRS మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పిలుపుమేరకు BRS కార్యకర్తలు మరియు రైతులు ఇందిరా గాంధీ చౌరస్తాలో కోయిల్ సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని ధర్నా రాస్తారోకో చేశారు మండల అధ్యక్షుడు లంబాడి తిరుపతయ్య ఈ సమావేశంలో మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నారని అందుకోసం రైతులకు వెంటనే కోయిల్ సాగర్ నీటిని విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మరియు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మ మహబూబ్‌నగర్ నుంచి మక్తల్ కు వెళ్తుండగా మరికల్ చౌరస్తాలో ఆమెని అడ్డగించి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో BRS కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పెద్దగడలో అన్నదాన కార్యక్రమం

**శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక యువక బృందం ఆధ్వర్యంలో నిర్వహణ**

**చిన్నంబావి మండలం 21 వుదయం రిపోర్టర్**

చిన్నంబావి మండల కేంద్రంలో పెద్దగడగ గ్రామంలో శ్రీశ్రీశ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక యువక బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజలందరూ ఈ అన్నదాన కార్యక్రమానికి హాజరై స్వామివారి ప్రసాదంగా అన్నదానం స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గోవుల లక్ష్మి వెంకటస్వామి, గోవుల అనూష రాజు, అక్షిత, రిషిక దాతలుగా వ్యవహరిస్తున్నారు. భక్తులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువక బృందం సభ్యులు పిలుపునిచ్చారు. భక్తి భావంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్రామంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా విచ్చేసి అన్నప్రసాదం స్వీకరించి దాతలను, నిర్వాహకులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుమల వెంకటేశ్వర్లు దంపతులు, కంటే చిన్న నరసింహ, గోవుల రాజు, పెరుమల కురుమూర్తి, పెరుమల పెద్ద కురుమూర్తి,



పెరుమల చెన్నకేశవులు, పూసలపాటి బాలచంద్రయ్య, పూసలపాటి కురుమూర్తి, పూసలపాటి ప్రవీణ్ కుమార్, పూసలపాటి విగ్నేష్, కంటే శివప్రసాద్, కంటే ఓం ప్రకాష్, కాలనీ ప్రజలు గ్రామ ప్రజలు శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక యువక బృందం సభ్యులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# వినాయకుడి ఆశీస్సులు పొందిన సోమిరెడ్డి



**బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు**

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 21)**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్‌లో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి మెయిన్ గేట్ దగ్గర వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, శ్రీశైలం, మాజీ టెలిఫోన్ బోర్డు సభ్యులు దయాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షులు ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే కేసీఆర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# 53వ సారి రక్తదానం చేసి ఔదార్యం చాటుకున్న ఓంప్రకాష్

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 21(వుదయం)**



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ బాలాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి ఓ నెగటివ్ రక్తం అవసరమని తెలుసుకున్న ప్రముఖ సామాజిక సేవకుడు ఓంప్రకాష్ స్పందించి రక్తదానం చేయడం జరిగింది తను ఇప్పటివరకు 53వ సారి రక్తదానం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.నాగల్‌గిద్ద మండలం ఉట్పల్లి గ్రామానికి చెందిన ఓంప్రకాష్ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడాన్ని తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో రక్తదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.రక్తదానం చేయడంతో పాటు రక్తదాన శిబిరాల ఏర్పాటుకు కూడా ఓంప్రకాష్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు ప్రశంసించారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి తన వంతు సహాయం అందిస్తూ సమాజ సేవలో ముందుండటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సామాజిక సేవ, రక్తదాన రంగంలో ఓంప్రకాష్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు డాక్టరేట్ గౌరవం కూడా లభించింది. అలాగే ఆయన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందారు. ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకుడిగా సేవలు అందిస్తూ రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. మరింత మంది రక్తదానం చేసేందుకు ప్రోత్సహిస్తూ చేస్తున్న ఆయన సేవలను పలువురు అభినందించారు.

# శ్రీవారి స్వర్ణ రథసేవలో వసుంధరాదేవి నూతన SVBC ఛైర్మన్‌కు శుభాకాంక్షలు



**తిరుమల, 20 సెప్టెంబర్ 2026:**

నటుడు, ఎమ్మెల్యే శ్రీ నందమూరి బాలకృష్ణ గారి సతీమణి శ్రీమతి వసుంధర గారు, తిరుమలలో శ్రీవారి శాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు జరిగిన స్వర్ణ రథ యాత్రలో పాల్గొన్నారు. ఈ రథయాత్ర సందర్భంగా, శ్రీమతి వసుంధర గారిని ఎస్‌విబిసి ఛైర్మన్ శ్రీ బి. శ్రీధర్ వర్మ గారు కలిసి ఆమె ఆశీర్వాదాలు పొందారు. శ్రీధర్ వర్మ గారికి వసుంధర దేవి గారు ఎస్వీబిసి ఛైర్మన్ గా ఎన్నికైనందుకుగాను శుభాకాంక్షలు తెలిపి ఆయనను అభినందించారు. అలాగే ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ గారు కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు మీ కుటుంబానికి ఎల్లప్పుడూ ఉండాలని శ్రీధర్ వర్మ గారు ఆకాంక్షించారు.

# ఓటరు దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి



**మహబూబ్ నగర్**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫారం 6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్ని జిలాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, పేర్లు తొలగింపు, వివరాల సవరణకు సంబంధించి ఎన్నికల అధికారి లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులపై విచారణలను సకాలంలో పూర్తి చేసి, జారీ చేసిన నోటీసులన్నీ సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఐడిఓసి కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, ఎన్నికల డి.టి. జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ ఎన్నికలకు నోటిఫికేషన్

**అక్టోబర్ 4న నిర్వహణ కమిటీ ఎన్నికలు**

**24న నామినేషన్ల స్వీకరణ.. 25న పరిశీలన.. 26న ఉపసంహరణ**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 21:-వుదయం**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4, 2026న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు (JD) శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సంగారెడ్డి జిల్లా శాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల జాబితాను ఇప్పటికే ప్రచురించినట్లు, సభ్యులందరికీ ఎన్నికల కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేసినట్లు ఆయన తెలిపారు.నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

సెప్టెంబర్ 25న ఉదయం 10.00 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహించి, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, అనంతరం తుది నామినేషన్ల జాబితాను ప్రచురించి, అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తామని తెలిపారు.అవసరమైన పక్షంలో అక్టోబర్ 4, 2026న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. ఆరోజు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 4.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని, ఫలితాల ప్రకటన అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నిక నిర్వహిస్తామని వెల్లడించారు.నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు *రూ.10,000/ తిరిగి చెల్లించబడని రుసుము (నాన్‌రిఫండబుల్)*గా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ ఫారాలను ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా సంప్రదించడం ద్వారా లేదా ఎన్నికల అధికారికి రాతపూర్వకంగా అభ్యర్థన సమర్పించి, అధీకృత వ్యక్తి ద్వారా సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పొందవచ్చని తెలిపారు.మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ *9949992039*ను సంప్రదించాలని సూచించారు.ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి వచ్చే సభ్యులు గుర్తింపు నిమిత్తం సొసైటీ జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఫోటో గుర్తింపునకు సంబంధించిన ఇతర ఆధారాన్ని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎన్నికల అధికారి శివప్రసాద్ కోరారు.

# మాతృమరణాలపై సమీక్ష ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



**మహబూబ్ నగర్**

బాలానగర్ పరిధిలోని బాలింత అనారోగ్య కారణము వలన చికిత్స కొరకు గాంధీ జనరల్ ఆసుపత్రి, హైదరాబాద్ వెళ్లి చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. ఇట్టి మాతృమరణం పై సంబంధిత పి. హెచ్ సి వైద్యులు,సిబ్బందితో పాటు, GGH మహబూబ్నగర్ గైనోకలాజిస్టులతో మరణానికి గల కారణాల పైన సమీక్ష సమావేశమును డి ఎమ్ హెచ్ ఓ డా. ఏ. శ్రీనివాసులు, GGH మెడికల్ సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా లు GGH లోని మీటింగ్ హాల్ లో నిర్వహించడం జరిగింది.ప్రతి గర్భిణీ ని గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకొని తగిన ఆరోగ్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రి కి వచ్చే వారికీ సమయానికి సరైన వైద్య సేవలు అందించాలని కోరారు. భవిషత్తులో మాతృ మరణాలను తగ్గించేందుకు అన్నిస్థాయిలలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో MHN ప్రోగ్రాం అధికారి డా. శంకర్, DIO డా. శైలజ, డా. శివకాంత్, డా. పులి విద్య, డా. అర్షదుల్ల, వైద్యులు, సిబ్బంది సైల్గొన్నారు.

# క్రైస్తవ మైనారిటీ యువతకు ఉచిత 'సైబర్ సెక్యూరిటీ' కోచింగ్

**-సంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్ రావ్**

**-ఈ నెల 22 నుంచి అక్టోబర్ 5 వరకు దరఖాస్తులకు అవకాశం**

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి జిల్లాలోని క్రైస్తవ మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (హైదరాబాద్) సౌజన్యంతో 202627 సంవత్సరానికి గాను ఉచిత 'సైబర్ సెక్యూరిటీ' (ప్లేస్‌మెంట్ లింక్డ్ ప్రోగ్రామ్) శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డి. వేంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ నుండి అక్టోబర్ 05, 2026 వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తు ఫారాలను పటాన్‌చెరులోని NH65 పక్కన ఉన్న 'ధ్రువ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్' (మంజీర జూనియర్ కాలేజ్, గౌతమ్ నగర్ కాలనీ) కార్యాలయం నుండి పొంది, అవసరమైన ధృవీకరణ పత్రాలను జతచేసి అక్కడే అందజేయాలని సూచించారు. 18 నుండి 45 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు BCC కుల ధృవీకరణ పత్రం లేదా బాప్టిజం పొందిన ధృవీకరణ పత్రం దరఖాస్తుతో జత చేయాలన్నారు.అలాగే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు TCతో పాటు రూ.10 బాండ్ పేపర్‌పై సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1,50,000, పట్టణ/మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ 2,00,000 లోపు ఆదాయం ఉండాలన్నారు.రేషన్ కార్డ్ లేని పక్షంలో మీసేవ ద్వారా పొందిన ఆదాయ ధృవీకరణ పత్రాన్ని తప్పక సమర్పించాలన్నారు. ఆధార్ కార్డ్ తప్పనిసరిగా దరఖాస్తుకు జత చేయాలన్నారు.మరిన్ని వివరాలకు 0402339106 (tscmfc Hyd) లేదా ఫోన్ నంబర్లు 9000641911, 7569391754, 9542867203 లను సంప్రదించాలని అధికారి వెంకటేశ్వర్ రావ్ సూచించారు.

# జంగిటి ఇంట్లో గణేష్ పూజా కార్యక్రమాలు



**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట సింగర్ కాలనీలో జంగిటి మల్లేష్ నివాసంలో ఏర్పాటు చేసిన గణేష్ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మండపం దగ్గర సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి 1104 సర్కిల్ ప్రెసిడెంట్ గోవింద్ రాజు, సెక్రటరీ మొగులప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె రఘు, అడిషనల్ సెక్రెటరీ రవీంద్ర చారి, డిస్కమ్ అడిషనల్ డైరెక్టర్ గోవర్ధన్,ఏఈ. మహేష్ గౌడ్ , డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి , రీజినల్ వైస్ ప్రెసిడెంట్ ఆవుటి. రమేష్ కుమార్ , ప్రవీణ్ , ఆర్టీజన్ లక్ష్మీకాంత్, రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.వెంకటేష్ లతో పాటు వీధి ప్రజల అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ పద్మా దేవేందర్ రెడ్డి



**కంటా రెడ్డి తిరుపతిరెడ్డి..**

మెదక్ జిల్లా వుదయం నిజాంపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఫంక్షన్ హాల్ లో బచ్చురాజు పల్లి గ్రామ ఉపసర్పంచ్ రాజశేఖర్ చెల్లె స్వప్న వివాహానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అలాగే టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంటారెడ్డి,తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరుల ఆశీర్వదించారు. అలాగే రామాయంపేట సొసైటీ వైస్ చైర్మన్ సులోచన వెంకటస్వామి గౌడ్, తండ్రి రాజా గౌడ్ ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ బాపురెడ్డి, బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బజార్ రంజిత్ గౌడ్, యూత్ అధ్యక్షులు మావురం రాజు,కల్యకుంట సర్పంచ్ అందే కొండల్ రెడ్డి, కనకరాజు,మాజీ ఎంపీటీసీ నంద్యాల బాల్ రెడ్డి, నాళం కృష్ణ గౌడ్,మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్,గౌస్, శ్రీకాంత్ గౌడ్,నాయిని లక్ష్మణ్, నగేష్, దుబ్బరాజా గౌడ్,సంగు స్వామి,రెడ్డి శెట్టి రవీందర్, నారాగౌడ్, రాజు నాయక్, నరేందర్,నాయక్ సుభాష్ నాయక్, బన్నీ, పంపరి నగేష్,

# పేటలో నేటి నుండి హజ్రత్ సయ్యద్ షా ఉర్సు వేడుకలు

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేటలోని దర్గా హజ్రత్ సయ్యద్ షా మహ్మద్ తఖీ సబ్జ్‌పోష్ ఖాద్రీ (రహ్) 4 రోజుల వార్షిక ఉర్సు వేడుకలు సెప్టెంబర్ 22న పతాక ఊరేగింపుతో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ముంబై, అహ్మదాబాద్ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు మత, కుల భేదాలకు అతీతంగా ఉర్సు వేడుకల్లో పాల్గొంటారు. భక్తులకు అవసరమైన అన్ని ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు సజ్జాదా నషీన్, దర్గా ముతవల్లీలు,నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమ వివరాల ప్రకారం సెప్టెంబర్ 22 మంగళవారం అసర్ నమాజ్ అనంతరం జామా మసీద్ ఎదురుగా ఉన్న పటేల్ హౌస్ నుంచి జులూస్‌ఎపర్చమ్ ఖాద్రియాతో ఉర్సు వేడుకలు ప్రారంభమవుతాయి.

సెప్టెంబర్ 23, బుధవారం ఇషా నమాజ్ అనంతరం సందల్ కట్టా నుంచి జులూస్‌ఎసందల్ నిర్వహిస్తున్నారు. ఈ ఊరేగింపులో వేలాది మంది మురీదులు, భక్తులు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. సందల్ మాలీ కార్యక్రమాన్ని దర్గా సజ్జాదా నషీన్ సయ్యద్ షా ఘియాసుద్దీన్ ఖాద్రీ,

సెప్టెంబర్ 24 గురువారం గ్యారహ్వీ షరీఫ్ కార్యక్రమం అదే రోజు ఇషా నమాజ్ అనంతరం దర్గా ప్రాంగణంలో మహ్ఫిల్‌ఎనాత్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సెప్టెంబర్ 25 శుక్రవారం ఫజర్ నమాజ్ అనంతరం మహ్ఫిల్‌ఎజియారత్ నిర్వహించబడుతుంది. ఇందులో భాగంగా జరిగే జల్సాఎఅజ్మత్‌ఎఔలియా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షహ్‌జాదా హుజూర్ గౌసుల్ ఆజమ్, ఖతీబ్‌ఎజమాన్ మౌలానా పీర్ సయ్యద్ ఆల్ ముస్తఫా ఖాద్రీ అల్‌మూసవి అల్‌జీలానీ (అలీ పాషా సాహెబ్), సజ్జాదా నషీన్ ఖాన్కాహ్ మూసవియా, హైదరాబాద్ హాజరై ప్రసంగించనున్నారు. ఆయనతో పాటు మౌలానా పీర్ ఆబిద్ హుస్సేన్ ఖాద్రీ అల్‌కాజ్మీ, కోతా కోట పాల్గొంటారు.

అదే రోజు ఇషా నమాజ్ అనంతరం దర్గా ప్రాంగణంలో మహ్ఫిల్‌ఎసమా నిర్వహించబడుతుంది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ జాకిర్ హుస్సేన్ తాజ్ ఖవ్వాల్ అండ్ పార్టీ, మొహమ్మద్ ఉస్మాన్ బందా నవాజీ అండ్ పార్టీ పాల్గొని ఖవ్వాలి ప్రదర్శించనున్నారు.

ఈ సందర్భంగా దర్గా ముతవల్లీలు హాజీ మహ్మద్ నవాజ్ మూసా, మహ్మద్ రఫీక్ చాంద్ మాట్లాడుతూ ఉర్సు షరీఫ్ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జాయిరీన్ల సౌకర్యార్థం దర్గా వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు, ముఖ్యంగా భక్తులు ఉర్సు షరీఫ్‌లోని అన్ని కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**వట్టిపల్లి (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 21 :**

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ వట్‌పల్లి మండలానికి చెందిన మాజీ సర్పంచులు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీపీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో సర్పంచులుగా పని చేసిన సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారు డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లులను పరిశీలించి త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# మా భూములకు పట్టాలు ఇవ్వండి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన రైతులు..**

మెదక్ జిల్లా వుదయం నిజాంపేట మండల పరిధిలోని కాసింపూర్ తాండ గ్రామానికి చెందిన రైతులు బచ్చరాజు పల్లి గ్రామ శివారులో గల భూములను కొనుగోలు చేసి 50 ఏళ్లు అవుతున్న వారి పేరున పట్టా కావడం లేదని సోమవారం ప్రజావాణిలో తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాసింపూర్ గ్రామ రైతుల భూములు సర్వేనెంబర్ 48,49,52,53, లో గల భూములలో 50 ఏళ్లుగా పంట సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఆ భూములు మా పేరు మీద పట్టాలు కావడం లేదని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నామన్నారు, ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రైతుల పేరుమీద పట్టా చేసేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాసింపూర్ గ్రామ సర్పంచ్ రామ్ చందర్ నాయక్, రైతులు గుగులోతు మున్యా, లచ్చిరాం, బోజియా, ప్రకాష్, ప్రవీణ్, చందర్, నారీ, బాలు, తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య సేవలు..మందుల పంపిణీ



**యోగ, ధ్యానంతో ఆరోగ్యంపై అవగాహన**

**రాజోలి, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)**

ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజోలి మండలంలోని రాజోలి గ్రామంలో సమగ్ర ఆరోగ్య, శ్రేయస్సు శిబిరాన్ని నిర్వహించారు. ప్రకృతి పరీక్షణ, పోషణ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల సమన్వయంతో పలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ఆహార ప్రదర్శనలో ఆయుర్వేద ఆధారిత పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీవనశైలి అంచనా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానంపై సూచనలు అందించారు. యోగ, ధ్యాన కార్యక్రమాలను నిర్వహించి శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

అనంతరం వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం, యోగ, సమతుల్య ఆహారం ప్రాధాన్యతపై ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ మెహఫూజ్ ఫుల్ హక్, ఫార్మసిస్టు యాస్మిన్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల పేరుతో అక్రమ ఇసుక రవాణా

* కాక్ర వేణి నది నుండి ప్రతిరోజు వందల టిప్పర్ల ఇసుక తరలింపు
* * ఇసుక తరలింపు ఆపకపోతే రైతులకు నష్టం
* అక్రమ ఇసుక
* ఇసుక రవాణాకు కాంగ్రెస్ నాయకుల అండ
* కాసులకు కక్కుర్తి పడుతున్న కాంగ్రెస్ నాయకులు రవాణా ఆపకపోతే ఉద్యమమే
* యాలాల మాజీ జెడ్పీటీసి సిద్రాల శ్రీనివాస్

**యాలాల సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి :-**



రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధి పనుల కోసం ఇసుక తరలింపు పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని యాలాల మాజీ జెడ్పీటిసి సిద్రాల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలో కాకర వేణి కాగ్న పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాలాల మాజీ జెడ్పీటిసి టిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య ముదిరాజ్, నాయకులు ఆశన్న మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని తెలిపారు. మండల పరిధిలోని విశ్వనాథ్ గ్రామ సమీపంలో గల శివ సాగర్ ప్రాజెక్టు నుండి పెద్ద ఎత్తున హిటాచి టిప్పర్లతో ఇసుక రవాణా జరుగుతుందని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై రైతులతో కలి అడ్డుకోవడం జరిగిందని తెలిపారు.మండలి పెద్ద ఎత్తున అక్రమ ఇసుక రవాణా.జరిగిందని తెలిపారు. యాలాల మండలంలో అధిక సంఖ్యలో రైతులు వ్యవసాయ బోర్లపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. శివ సార్ నుండి ఇసుక తరలించడం ఇసుక తరలించడం వల్ల ఇప్పుడు ఇప్పటికే బోర్లు అడుగంటి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని తెలిపారు. శివసాగర్ ప్రాజెక్టు వెనుక నుండి ఇసుక తరలించడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. దీంతో వివిధ గ్రామాల రైతుల నష్టపోతారని తెలిపారు. తాండూర్ ఎమ్మెల్యే ఇసుక రవాణా చేస్తున్న నాయకులకు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ఇసుక రవాణా అనుమతులను పరిశీలించగా ఎలాంటి అధికారిక పత్రాలు లేవని తెలిపారు. నకిలీ యాప్ తయారు చేసుకుని స్థానిక తాసిల్దార్ కార్యాలయం నుండి నిలబడుతున్న అనుమతులు చూపిస్తూ అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు తెలిపారని వివరించారు. ఇసుక రవాణాను నిలిపివేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఇసుక రవాణాను నిలిపివేయకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బి ఆర్ఎస్ నాయకులు రవి కుమార్ జీవి రెడ్డి, మల్లేశం, కృష్ణ కుమార్, శానప్ప రైతులు పాల్గొన్నారు

# ప్రీ ప్రైమరీ పాఠశాలలో నియామకాలు పూర్తి చేయాలి

**టీ. యస్. వి. అధ్యక్షుడు బంగారు కృష్ణ**

**సంగారెడ్డి వుదయం.**



ప్రీ ప్రైమరీ పాఠశాలలో ప్రభుత్వం వెంటనే టీచర్, ఆయా పోస్టుల నియామకాలు పూర్తి చేయాలి అన్నారు తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ, సోమవారం కలెక్టరేట్ లోని డి. ఈ. ఓ. కార్యాలయంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారికి బి. బాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 202627 సంవత్సరానికి ప్రీ ప్రైమరీ పాఠశాలలో నర్సరీ, ఎల్ కే జీ, యూ. కే. జీ, తరగతులు ప్రారంభం కోసం కాంట్రాక్టు పద్ధతిలో నోటిఫికేషన్ విడుదల చేసి అర్హుల జాబితా సిద్ధం చేసిన నియామకాలు చేపట్టక పోవడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే నియామకాలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలి అన్నారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ కార్యదర్శి చింతల సాయి కుమార్, విజయ్ , బస్వారాజ్ తదితరులు పాల్గొన్నారు..

# పిడుగుపాటుకు 16 ఏళ్ల బాలుడు మృతి

**చెట్టు కింద నిల్చున్న సమయంలో విషాద ఘటన.. యర్సన్‌దొడ్డిలో విషాదఛాయలు**

**గద్వాల, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)**



పిడుగుపాటుకు 16 ఏళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన కేటీ దొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్‌కుమారుడు మల్లేష్ (16) పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా వర్షం కురిసింది. వర్షం నుంచి తలదాచుకునేందుకు కృష్ణస్వామి దేవాలయం సమీపంలోని చెట్టు కింద మల్లేష్ నిల్చున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఆలయ వేలం పాటల ద్వారా రూ.90.28 లక్షల ఆదాయం

**గతేడాదితో పోలిస్తే రూ.13.21 లక్షలు అదనపు ఆదాయం**

**మొబైల్, సామాను భద్రపరిచే కేంద్రం నిర్వహణకు కొత్తగా రూ.6.10 లక్షల ఆదాయం**

**ఆలంపూర్, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)**



శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ హక్కుల కోసం నిర్వహించిన సీల్డ్, ఆన్‌లైన్, బహిరంగ వేలం పాటలకు విశేష స్పందన లభించింది. మొత్తం తొమ్మిది రకాల హక్కులకు వేలం నిర్వహించగా, ఐదు హక్కులు ఖరారయ్యాయి. వీటి ద్వారా దేవస్థానానికి రూ.84,18,000 ఆదాయం సమకూరింది.

ఫోటోలు, క్యాసెట్లు విక్రయించుకునే హక్కును అలంపూర్‌కు చెందిన ఐ. వెంకటరామిరెడ్డి రూ.29,55,000కు దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కును నల్గొండకు చెందిన కే. శ్రీనివాసరావు రూ.18,18,000కు, శౌచాలయాల నిర్వహణ హక్కును అలంపూర్‌కు చెందిన శివరాముడు రూ.9,16,000కు పొందారు. క్యాంటీన్ నిర్వహణ హక్కును అలంపూర్‌కు చెందిన ఎస్. నరేందర్‌రెడ్డి రూ.9,29,000కు, డాలర్లు, కంకణాలు విక్రయించే హక్కును బీచుపల్లికి చెందిన నరేష్‌గౌడ్ రూ.18 లక్షలకు దక్కించుకున్నారు.గత సంవత్సరం ఇదే హక్కుల నిర్వహణ ద్వారా రూ.70,96,995 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.84,18,000 ఆదాయం వచ్చింది. దీంతో గతేడాదితో పోలిస్తే రూ.13,21,005 అదనపు ఆదాయం సమకూరింది.

కొత్తగా మొబైల్, సామాను భద్రపరిచే కేంద్రంఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన మొబైల్ ఫోన్లు, సామాను భద్రపరిచే కేంద్రం నిర్వహణ హక్కును అలంపూర్‌కు చెందిన బి. సుబ్రహ్మణ్యం కుమార్ రూ.6,10,000కు దక్కించుకున్నారు. దీంతో ఈ వేలం ప్రక్రియ ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.90,28,000 ఆదాయం సమకూరింది.

మూడు హక్కుల వేలం వాయిదా

టెంకాయలు, పూజా సామగ్రి విక్రయించే హక్కు, చీరల నిర్వహణ హక్కు, వడిబియ్యం సేకరించే హక్కుల కోసం నిర్వహించిన సీల్డ్, ఆన్‌లైన్, బహిరంగ వేలం పాటల్లో తగినంత మంది పాల్గొనకపోవడంతో మూడు వేలాలను వాయిదా వేశారు. వీటిని తిరిగి నిర్వహించేందుకు నిర్ణయించారు.

వేలం పాటలు కురుమూర్తి స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ ఈఓ దీప్తితో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యూ పి హెచ్ సి లో ఎంబీబీఎస్ డాక్టర్ ను నియమించాలని వినతి

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా కేంద్రంలోని యు పి హెచ్ సి అశోక్‌నగర్‌లో ఎంబీబీఎస్ వైద్యాధికారిని నియమించాలని జిల్లా ఎంఐఎం అధ్యక్షులు ఖాదర్ సాహెబ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ పాషా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను కు వినతిపత్రం సమర్పించారు. అశోక్‌నగర్ యూ పి హెచ్ సి ద్వారా పట్టణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలతో పాటు గర్భిణీలకు ఏ ఎన్ సి సేవలు అందుతున్నాయని, ప్రస్తుతం అక్కడ బిఏఎంఎస్ వైద్యుడు లేకపోవడంతో ఎం ఎల్ హెచ్ పి సేవలు అందిస్తున్నప్పటికీ ఎంబీబీఎస్ వైద్యాధికారి అందుబాటులో లేరని వారు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. యూ పి హెచ్ సి కు సమీపంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు యూ పి హెచ్ సి లో ఎంబీబీఎస్ వైద్యాధికారి నియామకం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు, హైరిస్క్ గర్భధారణ గుర్తింపు అవసరమైన సమయంలో రిఫరల్ సేవలు అందించేందుకు వైద్యాధికారి సేవలు కీలకమని తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అశోక్‌నగర్‌లో వైద్యాధికారిని సాధ్యమైనంత త్వరగా నియమించాలని వారు అదనపు కలెక్టర్‌ను కోరారు.

# గణనాథుని పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి



**వెల్దండ సెప్టెంబర్ 21 (వు దయం)**

మండల కేంద్రంలోని రంగనాయక స్వామి దేవాలయంలో నెలకొల్పిన గణనాథుని కి సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు వై శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరాత్రులు విఘ్నేశ్వరుని భక్తిశ్రద్ధలతో పూజ నిర్వహించడం వల్ల ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు కార్యక్రమంలో నాయకులు భూపతి రెడ్డి, సంజీవ యాదవ్, అంజన్ రెడ్డి ,కృష్ణారెడ్డి, హరి కాంత్ రెడ్డి, తోపాటు పలువురు నాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నిర్వాసితులకు పరిహారం అందించేందుకు కృషి

**పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)**



ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించడంతో పాటు నిర్వాసితుల పునరావాస కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. హైదరాబాద్ నుంచి సోమవారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి సంబంధిత ఉన్నతాధికారులతో ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, అటవీ భూముల సమస్యల పరిష్కారంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడతలవారీగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన నిధుల్లో కొంత మొత్తాన్ని భూ నిర్వాసితులకు పరిహారంగా చెల్లించడంతో పాటు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు వినియోగించారని, కలెక్టర్ల ఖాతాల్లో ఉన్న మిగిలిన నిధులను యుద్ధప్రాతిపదికన భూములు కోల్పోయిన రైతులకు అందించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూడా నిధులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రైతులతో సంప్రదింపులు జరిపి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. రానున్న యాసంగిలో సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గద్వాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను రైతులను ఒప్పించి ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. భూసేకరణ పూర్తయిన రైతులకు అవార్డు పాస్ చేసి పరిహారం అందించేందుకు, నిధులను సద్వినియోగం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ కృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్‌గా కరుణ అజయ్ ప్రసాద్ ప్రమాణ స్వీకారం

**(సెప్టెంబర్ 21. బషీరాబాద్. వుదయం )**



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా కరుణ అజయ్ ప్రసాద్, వైస్ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.వీరితో పాటు డైరెక్టర్లుగా కళావతి, కాశిరెడ్డి, పింజారి ఖాదర్ మియా, హనుమంత్‌రెడ్డి, మాల బాలకృష్ణ, షేక్ ఫయాజ్, లక్ష్మీబాయి, మధుసూదన్, అనురాధ, కొనిగిరి నరసింహులు, మూడవ చంద్రశేఖర్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ కరుణ అజయ్ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గ సభ్యులందరి సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు.

వైస్ చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి సమష్టిగా పనిచేస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన రుణాలు, వ్యవసాయ సేవలు, ఇతర సహకార కార్యక్రమాలు సకాలంలో అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, సహకార సంఘం సభ్యులు హాజరై నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# కవ్వాల్ టైగర్ జోన్ తో ఉపాధి అవకాశాలు

**జన్నారం,సెప్టెంబర్21 (వుదయం విలేకరి )**



కవ్వాల్ టైగర్ జోన్ వల్ల ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందడమే గాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జన్నారం ఎఫ్. డి.ఓ రామ్మోహన్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో సోమవారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ లో పులులు, చిరుతలు, జింకలు, రేచుకుక్కలతో సహ అన్ని జంతువులకు అవాసం కల్పించడం, మరోపక్క ప్రసిద్ధ టేకు వనాల రక్షణ అమూల్యమైన అటవీ పర్యావరణ వ్యవస్థ పరిరక్షించబడుతుందని అన్నారు. మహారాష్ట్రలోని తాడోబా టైగర్ రిజర్వ్ అదే విధంగా తిప్పేశ్వర్ టైగర్ జోన్ మాదిరిగా కవ్వాల్ టైగర్ జోన్ ను అభివృద్ధి చేయడం ద్వారా పకృతి, వన్యప్రాణి పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభిస్తుందని దీని వల్ల హోటళ్లు, రవాణా, వ్యాపారం, అటవీ ఉత్పత్తుల గిరాకీతో పాటు సఫారి వాహనాల నిర్వహణలో స్థానికులు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ లో ప్రస్తుతం దాదాపు 130 మంది ఉద్యోగులుగా,బెస్ క్యాంపు వాచర్లుగా, ఆనిమల్ ట్రాకర్లుగా, డ్రైవర్ కంప్యూటర్ అపరేటరు గా స్థానికులు ఉపాది పొందుతున్నారని అన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్కు సంబంధించి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని పది కిలో మీటర్ల నుండి ఒక కిలోమీటర్ కు తగ్గిస్తూ ప్రభుత్వానికి 6 నెలల క్రితమే ప్రతిపాదనలను పంపించడం జరిగిందని తెలిపారు.

# రైతుల పక్షాన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి..ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి చొరవతో

**రూ.14 లక్షల ఆర్థిక సాయం**

**తాండూరు సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి**



చిట్టినాడు సిమెంట్ కర్మాగారం ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ నిర్మాణం కారణంగా నష్టపోయిన సంగెం కలాన్ గ్రామ రైతులకు నష్టపరిహారం అందించారు. రైతుల సమస్యను ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రైతుల పక్షాన నిలబడి కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి చొరవతో, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సామాజిక బాధ్యతతో రైతులకు సహాయం అందించేలా చర్యలు చేపట్టారు.

సోమవారం సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో సంగెం కలాన్ గ్రామ రైతులకు చిట్టినాడు సిమెంట్ కర్మాగారం ద్వారా మొత్తం రూ.14 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన ఈ 57 మంది నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణం వల్ల నష్టపోయిన రైతులకు అండగా నిలిచి పరిహారం అందేలా కృషి చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, కంపెనీ యాజమాన్యం సమన్వయంతో ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ . భవిష్యత్తులోనూ రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

రైతులకు నష్టం వాటిల్లిన సమయంలో పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు స్పందించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రైతుల పక్షాన నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాజకీయ భేదాలు పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి సామాజిక బాధ్యతగా తన నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కంపెనీ యాజమాన్యంతో సమన్వయం చేసుకుని రైతులకు నష్టపరిహారం అందేలా చొరవ చూపినట్లు తెలిపారు. చిట్టినాడు సిమెంట్ కర్మాగారం ద్వారా రైతులకు రూ.14 లక్షల ఆర్థిక సహాయం అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ**

సంగెంకలాన్ గ్రామంలో గత ఏడాది అకాల వర్షాల కారణంగా రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో పంట నష్టపోయిన 57 మంది రైతులకు సుమారు రూ.14 లక్షల పంట నష్టపరిహారం చెక్కులను చిట్టినోడు కంపెనీ ద్వారా అందించడం రైతులు సంతోషం వ్యక్తం చేశారు కొంతమందికి నష్టపరిహారం రాలేదని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నా దృష్టికి తీసుకు వచ్చారని అసలైన రైతులకు నష్టం జరిగితే తప్పకుండా న్యాయం చేస్తామని వారి యొక్క వివరాలను కంపెనీ యజమానికి ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు యు రమేష్,డిసిసిబి మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, కాబోయే పిఎసిఎస్సి చైర్మన్ పటేల్ జనార్దన్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము, చెంగోల్,బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజ్ కుమార్, అనిల్ కుమార్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి, చిట్టి నాడు కంపెనీ యజమాన్యం ఎన్ రవికుమార్ వైస్ ప్రెసిడెంట్, పి శేఖర్ బాబు, సందీప్ రెడ్డి భీమ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి సంగం కలాం గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా శంకరప్ప ప్రమాణ స్వీకారం

**(సెప్టెంబర్ 21, బషీరాబాద్, వుదయం):**

మార్కెట్ కమిటీ నూతన వైస్ చైర్మన్‌గా శంకరప్ప ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకరప్పకు పలువురు నాయకులు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శంకరప్ప తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

# ఆర్ వెంకటాపూర్ ను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

**రామాయంపేట,సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**



రామాయంపేట మండలంలోని ఆర్ వెంకటాపూర్ గ్రామ హ్యాబిటేషన్‌ను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం రామాయంపేట మండల ప్రజావాణి కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుతం హ్యాబిటేషన్‌గా ఉన్న వెంకటాపూర్‌ను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించి, గ్రామానికి అవసరమైన పరిపాలనా సౌకర్యాలు కల్పించాలని వారు అధికారులను కోరారు.అనంతరం ఇదే అంశంపై మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోనూ ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. వెంకటాపూర్‌ను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు రెవెన్యూ, పంచాయతీ తదితర ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యెంకుగారి ఉమ సంజీవ్‌రెడ్డి, ఉపసర్పంచ్ అనురాధ నరేశ్,వార్డు సభ్యులు రేవతి,నాగరాణి,పుర స్వామి,రాచపల్లి ఎల్లయ్య,అక్షిత సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట–కోదాడ మీదుగా బుల్లెట్ రైలు మార్గం ఏర్పాటు చేయాలి

**బుల్లెట్ రైలు, రైలు కారిడార్ సాధన సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ**

**కోదాడ, సెప్టెంబర్ 21(వుదయం)**



శంషాబాద్ నుంచి చెన్నై వరకు ప్రతిపాదిత బుల్లెట్ రైలు మార్గాన్ని సూర్యాపేట, కోదాడ మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుల్లెట్ రైలు, రైలు కారిడార్ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్-చెన్నై మధ్య ప్రతిపాదిత బుల్లెట్ రైలు కారిడార్ అత్యంత ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. ఈ మార్గాన్ని సూర్యాపేట-కోదాడ మీదుగా ఏర్పాటు చేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.కోదాడ, సూర్యాపేట ప్రాంతాలు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కీలక వాణిజ్య కేంద్రాలుగా ఉన్నాయని, ఈ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు వ్యాపార, విద్య, వైద్య అవసరాల కోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై నగరాలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. బుల్లెట్ రైలు మార్గం ఈ ప్రాంతాల మీదుగా వస్తే ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని పరిశీలించి సూర్యాపేట-కోదాడ మీదుగా బుల్లెట్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మద్దతును కూడగట్టేందుకు చేపట్టిన సంతకాల సేకరణలో వచ్చిన సంతకాలను ప్రధానమంత్రి, కేంద్ర రైల్వే మంత్రి, ముఖ్యమంత్రికి పంపనున్నట్లు సాధన సమితి నాయకులు తెలిపారు.కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ కనగాల నారాయణ, మాజీ మండల అధ్యక్షుడు దేవరశెట్టి సత్యనారాయణ, చింతా బాబు మాదిగ, త్రిపురశెట్టి రాజు, పోలిశెట్టి కృష్ణయ్య, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, పసుపులేటి రామారావు, నూనె సులోచన, డాక్టర్ ప్రసాద్ (ఈఎన్‌టీ), సలికంటి రామారావు, దేవరశెట్టి బ్రహ్మయ్య, పంది తిరపయ్య, సైదా నాయక్, నాగేంద్రచారి, ఏపూరి సత్యరాజు, ఓరుగంటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. బీజేపీ, సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, జనసేన, ఎంఆర్‌పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలతో పాటు హమాలీ, శాలివాహన, యాదవ తదితర సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సంతకాలు చేశారు.

# మల్లికార్జున హిల్స్‌లో మహా దీపోత్సవం



**బీరంగూడ, సంగారెడ్డి జిల్లా:**

మల్లికార్జున హిల్స్ బీరంగూడలోని గణేష్ మండపం వద్ద నిర్వహిస్తున్న మహా దీపోత్సవ కార్యక్రమం 9వ రోజు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపం భక్తులతో సందడిగా మారింది.

ఈ కార్యక్రమానికి శ్రీమతి శ్రీ లలిత రమేష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులతో కలిసి దీపాలను వెలిగించి మహా దీపోత్సవంలో పాల్గొన్నారు. గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు.ఈ మహా దీపోత్సవ కార్యక్రమంలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. మహిళలు, యువత, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని దీపాలను వెలిగించారు. దీపాల వెలుగులతో గణేష్ మండపం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ఈ కార్యక్రమంలో నగరాజు (అధ్యక్షులు), తలారి రాజు (జనరల్ సెక్రటరీ), రాఘవరెడ్డి (ఉపాధ్యక్షులు), హనుమంత్ రెడ్డి (ఉపాధ్యక్షులు), శివకుమార్ (కోశాధికారి), చంద్రారెడ్డి (మాజీ అధ్యక్షులు), అజ్జ నర్సింహులు (మాజీ అధ్యక్షులు), నాగార్జునరెడ్డి, రాజం రాజు, వీర శివా అన్న, ఉపేందర్ మరియు కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మునగాల, సెప్టెంబర్ 22 (ఉదయం):-**

మండల పరిధిలోని బరాకతి గూడెం గ్రామంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. ఈ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరుకావాలని తహసీల్దార్ సరిత సూచించారు.

# ప్రమాణ స్వీకారం రోజున చెలరేగిన చిచ్చు



**సభ్యులు రాకున్నా తుతు మంత్రంగా ప్రమాణ స్వీకారం**
**అలక చెందిన పాలక మండలి సభ్యుడు**
**పదవిని తిరస్కరించిన మరో సభ్యుడు**
***చైర్మన్ ఎంపికపై కాంగ్రెస్ నాయకుల అసంతృప్తి**

**యాలాల సెప్టెంబర్ 21 ఉదయం ప్రతినిధి:-**

యాలాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ( పి ఎ సి ఎస్ ) నూతన చైర్మెన్ ప్రమాణ స్వీకరోత్సవంలో సభ్యుల అలకతో విచిత్ర పరిస్థితి నెలకొంది. సోమవారం యాలాల పిఏసీఎస్ చైర్మెన్ గా అనిల్ కుమార్ గుప్త , వైస్ చైర్మన్ గా నర్సింలు మరియు పాలకవర్గ సభ్యులు పదవీ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. అంతలోనే పాలకమండలి సభ్యుడు గాండ్ల వీరప్ప తనను సమయానికి పిలువలేదని తాను వచ్చేవరకే పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగిపోవడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందని బాధను వ్యక్తం చేశారు. మరో పాలవ మండల సభ్యుడు అమృతప్ప చైర్మన్ పదవి, వైస్ చైర్మన్ పదవి ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తనకు పదవి వద్దని తిరస్కరించినట్లు సమాచారం. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉద్యోగి సీఈవో వేణు అనాలోచిత నిర్ణయాల వలన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో కందరగోళం నెలకొందని నూతన చైర్మెన్ గా బాధ్యతలు స్వీకరించిన అనిల్ కుమార్ పరిస్థితిని తీవ్రతరం కాకుండా సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కాంగ్రెస్ లో వర్గ విభేదాలు ప్రమాణ స్వీకారం రోజే బయటపడడంతో భవిష్యత్తులో సీనియర్, జూనియర్ నాయకుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. భవిష్యత్తులో ఈ గొడవలు ఎంతవరకు దారితీస్తాయోనని నాయకులు చర్చించుకోవడం కొసమెరుపుగా మారింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మొదలయ్యాని పలువురు చర్చించుకుంటున్నారు.

# మూడవ వార్డులో సీసీ రోడ్డు డ్రైనేజీ పనులకు శ్రీకారం : మున్సిపల్ చైర్పర్సన్



**ఏళ్ల తరబడి సమస్యకు పరిష్కారం.. స్థానికుల్లో హర్షం**

**రామాయంపేట,సెప్టెంబర్ 21 (ఉదయం ప్రతినిధి రాజాగౌడ్):**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి.ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్న సమస్యను మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు దృష్టికి తీసుకురాగా,ఆమె ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో అవసరమైన నిధులు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టారు.రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తయితే వార్డులోని ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగడంతో పాటు మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గూగులోత్ రవినాయక్, దాకి శ్యామల స్వామి, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, చింతల రాధాభవాని యాదగిరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు చింతల సప్న స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.శెట్టి అశోక్, సుంకోజి దామోదర్, దండు శివ, అబ్బాస్ నాగేందర్, పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు వేరుశనగ విత్తనాల పంపిణీ



**కల్వకుర్తి, సెప్టెంబరు 21 (ఉదయం ప్రతినిధి):**

కల్వకుర్తి రైతు వేదికలో సోమవారం శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నదాతలకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. 2026 27 సీజన్ కు గాను నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ సీడ్స్ పథకం ద్వారా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు రాయితీపై నాణ్యమైన వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. అదేవిధంగా పంట మార్పిడి ద్వారా నూనె గింజల సాగును ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం ఈ పథకం ముఖ్య లక్ష్యమని తెలిపారు. 1380 మంది రైతులకు గాను 1180 క్వింటాళ్ల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు .ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె. మంజుల, మండల వ్యవసాయ అధికారి సురేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**వరంగల్ విమానాశ్రయానికి బాపూజీ పేరు పెట్టాలని డిమాండ్**

**అమీన్‌పూర్ (ఉదయం): బీరంగూడ**

అమీన్‌పూర్ పట్టణ పద్మశాలి సంఘం మరియు అమీన్‌పూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు శ్రీ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీరంగూడ లోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ శ్రీ భావనాబుషి పద్మశాలి భవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమానికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అలాగే వరంగల్‌లో ప్రతిపాదితంగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బాపూజీ సేవలను చిరస్మరణీయంగా నిలబెట్టేందుకు ఇది సముచిత గౌరవమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆడేల్లి రవీందర్, కోకాల శ్రీనివాస్ మాకం మల్లేష్, అమీన్‌పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కుంట్ల యెల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, అమీన్‌పూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం యాదగిరి, ప్రధాన కార్యదర్శి చెన్న మోహన్, సంఘం కార్యకర్తలు, సభ్యులు, కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని బాపూజీకి ఘన నివాళులర్పించారు.



# శాపంతో చెట్లుగా మారిన దంపతులు

**వినాయక పూజలో దాగిన కథ!....**
**శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ శివకుమార్ గౌడ్.....**

**మెదక్ జిల్లా శివ్వంపేట**

మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గురు పీఠం లో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి. శిరిడి సాయి బాబాలతో పాటు కొలువుదీరిన శ్రీ గణేశునికి నేడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతరం విచ్చేసిన భక్తుల తో కలిసి శ్రీ గణేశుని పూజ లో దాగిన సారాంశం గురించి ఈల ప్రసంగించారు వారి మాటల్లో పూర్వం మాళవదేశంలో ఔరవుడు అనే విప్రుడు ఉండేవాడు. అతడు వేదవేదాంగవేత్త, పండితుడు, మేధావి. అతడి భార్య సుమేధ. భర్తకు తగిన ఇల్లాలు. ఆ దంపతులకు ఒక బాలిక జన్మించింది. వారు ఆమెకు శమీక అని నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచసాగారు. శమీకకు ఎనిమిదేళ్లు వచ్చాక ఔరవుడు కుమార్తె కోసం వరాన్వేషణ ప్రారంభించాడు. ధౌమ్యుడి పుత్రుడు, శౌనక మహర్షి శిష్యుడు, గురుసేవాతత్పరుడు అయిన మందారుడు అనే బాలుడి గురించి విన్నాడు. ధౌమ్య శౌనకులతో తన ఇంటికి సకుటుంబ సపరివారంగా ఆహ్వానించి, మందారుడితో తన కుమార్తె శమీక వివాహాన్ని జరిపించాడు. వివాహం తర్వాత మందారుడు తన గురుకులానికి వెళ్లిపోయాడు. కొంతకాలానికి శమీక యుక్త వయసురాలైంది. ఈ సంగతి తెలుసుకుని, మందారుడు అత్తవారింటికి వచ్చాడు. ఔరవుడు అతడికి మృష్టాన్న భోజనం పెట్టి, అల్లుడి మర్యాదలన్నీ చేశాడు. ధన కనక రాశులతో కుమార్తెను అప్పగించాడు. 'విప్రపుత్రా! నా కుమార్తెను విధి విధానంగా నీకు అప్పగిస్తున్నాను. ఆమెను అత్యంత ప్రేమగా చూసుకుంటూ, జాగ్రత్తగా దాంపత్యం చేయాలి' అని పరిపరి విధాలుగా జాగ్రత్తలు చెప్పి, సాగనంపాడు. శమీక మందారులు వెంటనే ఆశ్రమానికి వెళ్లక వనంలోనే సల్లాపాలాడుతూ గడపసాగారు. కొద్ది రోజులకు వారు ఉంటున్న వనానికి భృశుండి మహర్షి వచ్చాడు. దీర్ఘతపస్సు ఆచరించడం వల్ల ఆయన భ్రూమధ్యంలో తొండం అంకురించింది. నుదుట తొండం ఉన్న ఆ మహర్షి రూపాన్ని చూసి, శమీక మందారులు యవ్వన చాపల్యంతో పరిహసించారు. వారి పరిహాసానికి భృశుడికి కోపం వచ్చింది. 'మూర్ఖులారా! మీరు నన్ను పరిహసించి నవ్వారు. అందువల్ల మీరు సర్వప్రాణులూ వర్జించే వృక్షాలుగా మారిపోండి' అని శపించారు. భృంశుడి శాపానికి శమీక మందారులు భయంతో వణికిపోయారు. వెంటనే క్షమించమంటూ ఆయన పాదాల ముందు మోకరిల్లారు.

'మీరు నా నుదుటనున్న తొండాన్ని చూసి నవ్వారు. అందువల్ల తొండమున్న దేవుడైన వినాయకుడు మిమ్మల్ని కటాక్షించినప్పుడు మీకు మీ నిజరూపాలు తిరిగి వస్తాయి' అని చెప్పి, వెళ్లిపోయాడు. శమీక శమీవృక్షంగా, మందారుడు మందారవృక్షంగా మారిపోయారు. అత్తవారింటికి వెళ్లిన శిష్యుడు ఎన్నాళ్లయినా తిరిగి రాకపోవడంతో శౌనకుడు శిష్య సమేతంగా ఔరవుని ఇంటికి వెళ్లి, మందారుడి గురించి అడిగాడు. తాను కూతురితో సహా అల్లుడిని చాలారోజుల కిందటే పంపానని ఔరవుడు బదులిచ్చాడు. పిల్లలు జాడలేకుండా పోవడంతో శౌనకుడు, ఔరవుడు- ఇద్దరూ చింతాక్రాంతులయ్యారు. అడవిమార్గంలో వారిని ఏ క్రూరమృగాలైనా చంపేసి ఉంటాయేమోనని లేదా చోరుల బారినపడి హతమైపోయి ఉంటారేమోనని భయపడ్డారు. చివరకు ఇద్దరూ కలసి శమీక మందారులను వెదకడానికి అడవిలోకి వెళ్లారు. అటవీమార్గంలో వారి పాదచిహ్నాలను గుర్తించారు. అలసిపోవడంతో ఔరవ శౌనకులు అడవిలోని కొలనులో స్నానం చేసి, ధ్యానమగ్నులయ్యారు. ధ్యానంలో వారికి జరిగినదంతా తెలిసింది.

'మందారుడిని చదువు కోసం అతడి తండ్రి నా గురుకులంలో వదిలి వెళ్లాడు. అతడికి నేనిప్పుడు ఏమని బదులివ్వాలి?' అని శౌనకుడు శోకతప్తుడయ్యాడు. ఔరవుడిదీ అదే పరిస్థితి. గణేశుడిని ఆరాధించి, వీరి శాపవిమోచనను కోరుకుందాం అని ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. వెంటనే వారు ఒంటి కాలిపై నిలబడి గణేశుని కోసం తపస్సు ప్రారంభించారు. నిరాహారులై వారు ఒంటికాలిపై ఏకధాటిగా సాగిస్తున్న తపస్సుకు గణేశుడు ప్రసన్నుడయ్యాడు. వారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. ఏకదంతుడు కళ్లముందు నిలిచే సరికి శౌనక ఔరవులు భక్తిపారవశ్యంతో అతడిని స్తుతించారు.'భక్తులారా! మీ తపస్సుకు మెచ్చాను. మీ మనోభీష్టమేమిటో చెప్పండి, నెరవేరుస్తాను' అని పలికాడు గజాననుడు. శౌనక ఔరవులు శమీక మందారుల వృత్తాంతాన్ని చెప్పి, వారికి శాపవిమోచనం కలిగించాలని కోరారు. గణేశుడు 'తథాస్తు' అని పలికాడు.

'నేను ఎల్లప్పుడూ మందారవృక్ష మూలంలో నిలిచి ఉంటాను. శమీవృక్షంలోనూ కొలువై ఉంటాను. నాకు దూర్వాంకురాలే కాకుండా శమీపత్రాలు కూడా ప్రీతిపాత్రమవుతాయి. దూర్వాంకురాలు, మందార పత్రాలు లభించనప్పుడు శమీపత్రాలతో పూజిస్తే, నేను ప్రసన్నుడనవుతాను. దూర్వాంకుర, మందారపత్ర, శమీపత్రాలతో నన్ను పూజించేవారికి మనోవాంఛిత సిద్ధి, మోక్షప్రాప్తి కలుగుతాయి' అని పలికి గణపతి అంతర్ధానమయ్యాడు.

ఇది దేశంలోనే అత్యంత అరుదైన ఆలయం. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరా జిల్లా కుమావూ కొండల ప్రాంతంలో చితాయి గ్రామంలో ఉన్న ఈ ఆలయాన్ని స్థానికులు 'గోలూ దేవతా' ఆలయంగా పిలుస్తారు. ఇక్కడి మూలవిరాట్టు 'చితాయి గోలూ దేవత' శివుడి అవతారమైన గౌరభైరవుడు. గౌరభైరవుడు సత్వరన్యాయం చేస్తాడని భక్తుల విశ్వాసం. న్యాయం కోరుతూ రాసే విజ్ఞాపనపత్రాలను భక్తులు ఈ ఆలయంలో వేలాడదీస్తారు. తమకు న్యాయం జరిగితే, ఆలయానికి తిరిగి వచ్చి కంచు లేదా రాగి లేదా ఇత్తడి లోహాలతో తయారు చేసిన గంటలను వేలాడదీస్తారు. ఈ ఆలయంలో ఎక్కడ చూసినా, అసంఖ్యాకంగా గంటలు, భక్తులు వేలాడదీసే విజ్ఞాపనపత్రాల కాగితాలు కనిపిస్తాయి అని చక్కగా వివరించారు. విన్న భక్తులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగౌని జిన్నారం శివకుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గంట ఆలస్యంగా బస్సు

**విద్యార్థులకు అవస్థలు**
**పైడిగుమ్మల్‌కు 5.30 గంటలకు రావాల్సిన బస్సు 6.30కు రాక**
**బస్సు కోసం విద్యార్థుల నిరీక్షణ.. ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థినులు**
**సమయపాలనపై విద్యార్థుల ఆవేదన.. అధికారుల దృష్టి సారించాలని విజ్ఞప్తి**
**డిపో మేనేజర్ కేటాయించిన సమయం ఇదేనన్న డ్రైవర్**

**కోహీర్, సెప్టెంబర్ 21 (ఉదయం ప్రతినిధి):**

కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామానికి సోమవారం సాయంత్రం రావాల్సిన ఆర్టీసీ బస్సు గంట ఆలస్యంగా రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటలకు పైడిగుమ్మల్‌కు చేరాల్సిన TS 15 Z 0133 నంబర్ గల బస్సు సోమవారం సుమారు 6.30 గంటలకు చేరుకుంది.

**గంటపాటు ఎదురుచూపులు.. విద్యార్థుల్లో ఆందోళన**

బస్సు కోసం విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు, చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. చీకటి పడే సమయం కావడంతో విద్యార్థినులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. సమయానికి బస్సు రాకపోవడంతో తమ ప్రయాణంపై అనిశ్చితి నెలకొంటోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**బస్సు ఆలస్యానికి కారణమేంటి?**

బస్సు డ్రైవర్ శివాజీ గౌడ్‌ను విద్యార్థులు ఆలస్యంపై ప్రశ్నించగా, డిపో మేనేజర్ తమకు ఈ సమయాన్నే కేటాయించారని తెలిపినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. దీంతో నిర్ణయించిన సమయం, వాస్తవంగా బస్సు చేరుకునే సమయంపై విద్యార్థుల్లో అసంతృప్తి వ్యక్తమైంది.

విద్యార్థుల ఇబ్బందులపై దృష్టి పెట్టాలి

గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ విద్యార్థులు చదువుల కోసం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. బస్సు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులతో పాటు వారి సురక్షిత ప్రయాణంపైనా ప్రభావం పడే అవకాశం ఉందని వారు అంటున్నారు.సమయపాలన పాటించాలని విజ్ఞప్తి

పైడిగుమ్మల్ మీదుగా నడిచే బస్సులను నిర్ణీత సమయానికి నడిపించాలని విద్యార్థులు కోరుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళ విద్యార్థినులు ఎక్కువగా ప్రయాణించే నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# ఎ స్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేస్తాం

**రాజకీయ పార్టీలు, మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 21 (ఉదయం బ్యూరో):**



ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, పొలిటికల్ పార్టీలకు, మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో నాగర్ కర్నూల్ కలెక్టర్ ఐడీఓసీ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, సలోని చాబ్రాతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల అధికారి సమీక్షించి నోటీసుల జారీ, పెండింగ్ నోటీసులు, హియరింగ్ ల నిర్వహణ, ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. గత ఐదు రోజులుగా పెండింగ్ లో ఉన్న నోటీసులకు గల కారణాలను అడిగి తెలుసుకుని, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

బీఎల్ఓలు, బీఎల్ఏల సహాయంతో సంబంధిత ఓటర్లకు నోటీసులు సక్రమంగా అందేలా చూడాలని, పారదర్శకత పాటించాలని సూచించారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులకు నోటీసులు జారీ అయిన సందర్భంలో నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులకు అందజేసి వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును ఏఈఆర్ఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆన్ లైన్ లో డేటా నమోదు, పెండింగ్ అంశాలను పరిశీలిస్తూ జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర ఎన్నికల అధికారి ఇచ్చిన సూచనలను పక్కాగా అమలు చేస్తామని, నోటీసుల జారీ నుంచి హియరింగ్ ల వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తూ పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు లేదు.. కరెంటూ లేదు!

**కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదు : బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 21 (ఉదయం ప్రతినిధి):**

ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్ రెడ్డి విమర్శించారు. సోమవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.శ్రీశైలం డ్యాం దాదాపు నిండిన సమయంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని వినియోగించుకోకుండా, ఇప్పుడు నీటి కోసం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటకకు వెళ్లి చర్చలు జరుపుతామనడం విడ్డూరంగా ఉందన్నారు. పాలమూరు జిల్లాలో 300 కిలోమీటర్ల మేర కృష్ణానది ప్రవహిస్తున్నా, సాగునీటికి రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, కనీసం విద్యుత్ అందిస్తే బోరుబావుల ద్వారా కొంతమేర పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ఆ హామీని విస్మరించిందని మండిపడ్డారు. నిండు శాసనసభలో అధికార పార్టీ ఎమ్మెల్యేలే విద్యుత్ సరఫరాపై ప్రశ్నించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు రెండు పంటలు పండించుకుని సంతోషంగా ఉండేవారని, అప్పట్లో వలస వెళ్లినవారు తిరిగి స్వగ్రామాలకు వస్తే, నేటి ప్రజాపాలనలో మళ్లీ వలసలు పెరుగుతున్నాయని విమర్శించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రైతుబంధు నిధులు కూడా విడతలవారీగా సగం సగం జమచేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపించారు.

**రైతులకు ఇబ్బందికరంగా మారిన ఎరువుల యాప్ ను తక్షణమే రద్దు చేయాలని, రైతు బీమా పథకాన్ని పునరుద్ధరించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.**

రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరపున ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ ఆందోళనకు సంఘీభావంగా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అర్థం రవి, బాలగౌడ్, కౌన్సిలర్ అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రియదర్శిని జూరాల జలసమరం



**పోలీసుల అదుపులో చిట్టెం!**
**సాగునీటి కోసం రైతుల ఆందోళన.. మాజీ ఎమ్మెల్యే అరెస్ట్**
**చిట్టెంను తరలించకుండా అడ్డుకున్న ఆయకట్టు రైతులు.. పోలీసులతో తీవ్ర వాగ్వాదం**
**పరిస్థితి ఉద్రిక్తం.. భారీగా పోలీసు బలగాల మోహరింపు**

**ధరూర్ సెప్టెంబర్ 21 (ఉదయం బ్యూరో)**

సాగునీటి కోసం రైతులు కదం తొక్కడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత నెలకొంది. జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రైతులతో కలిసి నిరసనకు దిగారు. సాగు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పోలీసుల చర్యను అడ్డుకున్నారు. చిట్టెంను తరలించే క్రమంలో రైతులు- పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాటతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. తమకు సాగునీరు విడుదల చేయాలని రైతులు నినదించారు. చిట్టెంను తరలించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో రైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. ప్రియదర్శిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సాగునీటి విడుదలపై రైతుల ఆందోళన నేపథ్యంలో జూరాల వద్ద ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

# కొంతాన్పల్లి భూములపై సమగ్ర విచారణ జరపాలి



**ఉదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 21....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని కొంకాన్పల్లి గ్రామంలోని దళితులకు కేటాయించిన ప్రభుత్వ భూములు అక్రమంగా ఇతరుల పేర్లపై రికార్డుల్లోకి ఎక్కిన విషయమై గ్రామస్థులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబర్ 329లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో స్థానిక దళిత కుటుంబాలకు కుటుంబానికి ఒక ఎకరం చొప్పున పట్టాలు ఇచ్చారని తెలిపారు. అయితే గ్రామానికి సంబంధం లేని వ్యక్తి అధికార పార్టీ నాయకుడి బంధువు రాజలింగంగారి శ్రీనివాస్రెడ్డి పేరుపై 4ఎకరాల 16గుంటల భూమి అక్రమంగా రికార్డుల్లో నమోదైందని ఆరోపించారు. అక్రమంగా నమోదైన పేరును తొలగించి అర్హులైన దళితులకు కేటాయించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామంలోని సర్వేనంబర్ 330, 331, 334, 335, 336, 337, 362, 377, 380, 383, 385 386 387 రికార్డులు పొందిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకొని పార్ట్ బీ ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగం దేవలింగం, శివకుమార్, గుండు శంకర్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన కుటుంబం.. తక్కశిలలో విషాదఛాయలు**

**గద్వాల సెప్టెంబర్ 21 (ఉదయం కరస్పాండెంట్)**

అలంపూర్ నియోజక వర్గంలోని ఉండవెల్లి మండలం తక్కశిల గ్రామానికి చెందిన విశ్వంరాజు (22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై కర్నూలు వైపు వెళ్తుండగా అలంపూర్ చౌరస్తా సమీపంలో గుర్తుతెలియని మరో ద్విచక్ర వాహనం ఆయన వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విశ్వంరాజును చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనం వివరాలు తెలియాల్సి ఉంది. విశ్వంరాజు తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడు కావడంతో ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. యువకుడి మృతితో తక్కశిల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# ఘనంగా తమ్మలితోట బిందుప్రియ జన్మదిన వేడుకలు

**"కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు"**

**కోహీర్, సెప్టెంబర్ 21 (ఉదయం ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం చింతల్‌గట్ గ్రామానికి చెందిన సూర్య రిపోర్టర్ సంగన్న పాటిల్ కుమార్తె తమ్మలితోట బిందుప్రియ జన్మదిన వేడుకలు సోమవారం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బిందుప్రియ కేక్ కట్ చేయగా, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆమెకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ తినిపించి, పూలతో అభినందనలు తెలియజేస్తూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.జన్మదిన వేడుకల సందర్భంగా ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొంది. చిన్నారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉత్సాహంగా పాల్గొని బిందుప్రియతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో బిందుప్రియ తాను కోరుకున్న లక్ష్యాలను సాధించి, జీవితంలో మరిన్ని విజయాలు అందుకోవాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆకాంక్షించారు. ఆమెకు ఎల్లప్పుడూ కుటుంబ సభ్యుల ప్రేమ, స్నేహితుల సహకారం ఉండాలని కోరుకున్నారు.జన్మదిన వేడుకల్లో బంధువులు, స్నేహితులు పాల్గొని బిందుప్రియకు శుభాకాంక్షలు అందజేశారు. కేక్ కటింగ్ అనంతరం అందరూ కలిసి ఫొటోలు దిగుతూ వేడుకలను మరింత సందడిగా మార్చారు. దీంతో చింతల్‌గట్‌లోని బిందుప్రియ ఇంటి వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

# మునగాల పీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలి

**24 గంటల ప్రథమ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి - బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతి**




మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):- మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఖాళీగా ఉన్న సుమారు ఎనిమిది కేటగిరీలకు చెందిన ఉద్యోగ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరుతూ మునగాల మండల ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత కారణంగా అత్యవసర సమయాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు.మునగాల మండల కేంద్రం జాతీయ రహదారి-65పై ఉండటంతో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, జాతీయ రహదారి దాటే సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న జాతీయ రహదారి ప్రాంతం ప్రమాదాలకు కేంద్రంగా మారిందని, ప్రమాదాల్లో పలువురు గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రమాదాలు జరిగిన సమయంలో తక్షణ వైద్యం అందించేందుకు అవసరమైన స్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు పీహెచ్‌సీలో 24 గంటల పాటు పూర్తిస్థాయిలో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా అత్యవసర రక్త అవసరాలను దృష్టిలో ఉంచుకుని మునగాల పీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంక్ లేదా రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజావాణి దరఖాస్తులో కోరారు. మండల ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి, పీహెచ్‌సీని పూర్తిస్థాయి వైద్య సేవలు అందించే కేంద్రంగా అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మునగాల జనవేదిక కన్వీనర్ మరువాడ ఆంజనేయ శర్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, ఎస్‌కే పాషా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అనేక ప్రయోజనాలు

**ఆత్మ పథకం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నివేదిత**



మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):- ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుని దీర్ఘకాలికంగా రైతులు ప్రయోజనం పొందవచ్చని ఆత్మ పథకం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నివేదిత తెలిపారు. సోమవారం మునగాల రైతు వేదికలో రైతులకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం, పంటల్లో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆత్మ డీడీ నివేదిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇఫ్కో, కోరమాండల్ సంస్థల ప్రతినిధులు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించడంతో పాటు అందుబాటులో ఉన్న సేంద్రియ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.కేవీకే శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. స్థానికంగా లభించే సేంద్రియ వనరులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు.ప్రకృతి వ్యవసాయ రైతు మొగలూరి గోపి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరగడంతో పాటు తేమను నిలుపుకునే సామర్థ్యం మెరుగుపడుతుందని తెలిపారు. నేలలో సూక్ష్మజీవుల కార్యకలాపాలు పెరిగి, దీర్ఘకాలంలో నేల సారాన్ని కాపాడుకోవడానికి ఈ పద్ధతులు దోహదపడతాయని వివరించారు.రైతులు తమ పంటల అవసరాలకు అనుగుణంగా జీవ ఎరువులు, సేంద్రియ కషాయాలు, పంట అవశేషాల వినియోగం, అంతర పంటలు, పంట మార్పిడి వంటి పద్ధతులను అవలంబించాలని అధికారులు సూచించారు. పొలాల్లో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకొని, నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ స్థిరమైన వ్యవసాయం వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకులు పి. ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి బి. రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, మునగాల ఉప సర్పంచ్ కాసర్ల వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇఫ్కో జిల్లా అధికారి వెంకటేష్, కోరమాండల్ ఏరియా మేనేజర్ తిరుమల రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభం



మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):- విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నల్లపాటి శ్రీరామ్ ట్రస్టు ముందుకు వచ్చింది. మునగాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కోదాడ నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీల సందర్భంగా క్రీడాకారుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు సహాయాన్ని నిర్వాహకులకు అందజేశారు.జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతి, ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలను మునగాల గ్రామ సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.కోదాడ నియోజకవర్గ స్థాయిలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు తెలిపారు. సెప్టెంబర్ 21న అండర్-14, అండర్-17 బాలికలకు, సెప్టెంబర్ 22న అండర్-14, అండర్-17 బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగంగా నల్లపాటి శ్రీరామ్ ట్రస్టు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించడం పట్ల నిర్వాహకులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు. విద్య, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడంలో ట్రస్టు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, ఎస్ఐ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి




మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):- మునగాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు.ప్రజావాణిలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 3, ఆరోగ్య శాఖకు సంబంధించి 2 దరఖాస్తులు కలిపి మొత్తం 5 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఆయా దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్ సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపాలని ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీజే శబ్దంతో కాదు.. సేవతో యువత ఉనికిని చాటాలి

# యువతా.. ఒక్కసారి ఆలోచించండి!



మునగాల సెప్టెంబర్ 21 (వుదయం):- దుగల పేరుతో డీజేలు, భారీ శబ్దాలతో హంగామా చేయడం యువతకు గొప్పతనం కాదని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడమే నిజమైన యువశక్తికి నిదర్శనమని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్ అన్నారు.గణేష్ నిమజ్జనం, కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు వంటి పండుగల సమయంలో భక్తిని చాటుకోవడానికి భారీ శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. దేవుడిపై భక్తిని డీజే శబ్దం నిర్ణయించదని, మన ప్రవర్తన, మంచి పనులే భక్తికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.యువత ఉత్సాహంగా పండుగల్లో పాల్గొనాలని, అదే సమయంలో సమాజం పట్ల బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. డీజే శబ్దాల కారణంగా పక్కింటి చిన్నారులు నిద్రకు దూరం కావడం, వృద్ధులు ఇబ్బందులు పడటం, అనారోగ్యంతో ఉన్నవారు అసౌకర్యానికి గురికావడం, విద్యార్థులు చదువుకోలేకపోవడం వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని కోరారు.డీజేలకు ఖర్చు చేసే డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని సుధాకర్ గౌడ్ అన్నారు. అదే డబ్బుతో పేద విద్యార్థులకు పుస్తకాలు అందించవచ్చని, పేద కుటుంబాలకు భోజనం పెట్టవచ్చని, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని తెలిపారు. పండుగ ముగిసిన తర్వాత కూడా ఎవరికైనా ఉపయోగపడేలా చేసే సేవే నిజమైన పండుగకు అర్థమని అన్నారు. "శబ్దం పెంచడం సులభం.. కానీ మన విలువను పెంచుకోవడం కష్టం. డీజే శబ్దం కొన్ని పిలుపునిచ్చారు.పండుగల సమయంలో ఉత్సాహాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం లేదని, అయితే ఇతరుల ప్రశాంతత, భద్రతకు భంగం కలగకుండా నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. యువత మారితే సమాజంలో మార్పు వస్తుందని, భక్తిని శబ్దంతో కాకుండా ప్రవర్తనతో, ఉత్సాహాన్ని హంగామాలో కాకుండా సేవలో చూపించాలని సుధాకర్ గౌడ్ అన్నారు.

## విజయ గణపతి ఆలయంలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



కోదాడ సెప్టెంబర్ 21(వుదయం)కోదాడ పట్టణంలోని విజయ గణపతి దేవాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణనాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలంపాట భక్తుల ఉత్సాహం నడుమ పోటీపోటీగా సాగింది. వేలంపాటలో ఓరుగంటి నిఖిల్ రూ.38 వేలుకు లడ్డూను దక్కించుకున్నారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఓరుగంటి వెంకట బ్రహ్మం, ఓరుగంటి రాము, ఓరుగంటి నవీన్ కుమార్ మహా అన్నదాతలుగా వ్యవహరించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ఓరుగంటి నారాయణ, ధనలక్ష్మి జువెలర్స్ నిర్వాహకులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోలిశెట్టి కృష్ణయ్య, చలపతి శివ, గోపారపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ మెగా జాబ్ మేళాపై పూర్తి సమాచారం ఇవ్వాలి

**కాపర్తి మణికంఠ కుమార్**



కోదాడ, సెప్టెంబర్ 21 (వుదయం):- కోదాడలో జిల్లా ఉపాధి కార్యాలయం, కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సామాజిక కార్యకర్త కాపర్తి మణికంఠ కుమార్ కోరారు. జాబ్ మేళా నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై సమాచారాన్ని కోరుతూ ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు సమర్పించినట్లు ఆయన తెలిపారు.జాబ్ మేళా నిర్వహణకు తీసుకున్న అనుమతులు, ప్రభుత్వ నిధుల కేటాయింపు జరిగిందా లేదా, ఒకవేళ నిధులు కేటాయిస్తే ఎంత మొత్తం కేటాయించారు, ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు, ఖర్చులకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, చెల్లింపుల వివరాలను అందించాలని కోరినట్లు తెలిపారు. అలాగే జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల పూర్తి జాబితా, ఆయా కంపెనీల ద్వారా అందుబాటులో ఉంచిన ఉద్యోగాల వివరాలు, ఉద్యోగాల సంఖ్య, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన సమాచారం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య తదితర వివరాలను వెల్లడించాలని కోరారు. అదేవిధంగా జాబ్ మేళా నిర్వహణలో విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బంది, వాలంటీర్ల వివరాలు, వారి హాజరు రికార్డులు, కార్యక్రమానికి సంబంధించిన అధికారిక నివేదికలు, సమావేశాల వివరాలు, ఇతర పరిపాలనా రికార్డులను కూడా అందించాలని దరఖాస్తులో కోరినట్లు కాపర్తి మణికంఠ కుమార్ తెలిపారు.జాబ్ మేళా నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు అందాయా, అధికార దుర్వినియోగంపై ఏవైనా విచారణలు జరిగాయా, విచారణ జరిగితే అందుకు సంబంధించిన నివేదికలు, తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను కూడా అందించాలని కోరినట్లు తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండటం అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే అభ్యర్థుల వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన గోప్యత, డేటా ప్రైవసీ నిబంధనలను గౌరవిస్తూ, చట్టప్రకారం బహిర్గతం చేయగల అధికారిక రికార్డులు, సమగ్ర గణాంకాలు, ఆర్థిక వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కాపర్తి మణికంఠ కుమార్ కోరారు.

# క్రీడాకారుల కోసం నల్లపాటి శ్రీరామ్ ట్రస్టు రూ.10 వేల సాయం

**కోదాడ నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభం**



మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):- విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నల్లపాటి శ్రీరామ్ ట్రస్టు ముందుకు వచ్చింది. మునగాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కోదాడ నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీల సందర్భంగా క్రీడాకారుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు సహాయాన్ని నిర్వాహకులకు అందజేశారు.జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతి, ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలను మునగాల గ్రామ సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.కోదాడ నియోజకవర్గ స్థాయిలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు తెలిపారు. సెప్టెంబర్ 21న అండర్-14, అండర్-17 బాలికలకు, సెప్టెంబర్ 22న అండర్-14, అండర్-17 బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగంగా నల్లపాటి శ్రీరామ్ ట్రస్టు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించడం పట్ల నిర్వాహకులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు. విద్య, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడంలో ట్రస్టు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, ఎస్ఐ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# గణపవరంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులకు శ్రీకారం



మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):- మునగాల మండల పరిధిలోని గణపవరం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనుల్లో భాగంగా సర్పంచ్ అమరబోయిన మట్టయ్య ఆధ్వర్యంలో దర్వాజా నిలబెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అమరబోయిన మట్టయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మాణం పూర్తయితే చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పగిళ్ల మైబు సైదులు, అంగన్‌వాడీ టీచర్ లలిత, శ్రీధర్, జ్యోతి, చారి, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సైదా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు పెరుమాళ్ల రామారావుకు ఘన సన్మానం

**సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం : బొల్లిశెట్టి కృష్ణయ్య**



కోదాడ, సెప్టెంబర్ 21(వుదయం)ద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు పెరుమాళ్ల రామారావు సేవలు ప్రశంసనీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లిశెట్టి కృష్ణయ్య అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో మండల బీజేపీ అధ్యక్షుడు గాదరి పుల్లారావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రామారావు నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొల్లిశెట్టి కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థుల జీవితాలకు సరైన దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని అన్నారు. అంకితభావం, నిరంతర కృషికి గుర్తింపుగా లభించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ఉపాధ్యాయ వృత్తికే గర్వకారణమని కొనియాడారు.కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టయ్య, ఓబీసీ మోర్చా సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగేంద్రచారి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ చింతా మాధవరెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు యరగని రాధాకృష్ణ, భూమా శ్రీనివాస్, సీనియర్ నాయకుడు ఒంగాల పిచ్చయ్య, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడు ఏపూరి గణేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా భళా!

**నిరుద్యోగుల కళ్లలో ఆనందం .. జీవితాల్లో కొత్త వెలుగులు ఉత్తమ్ దంపతుల చొరవపై యువత హర్షం**



కోదాడ, సెప్టెంబర్ 21(వుదయం)కోదాడలో ఈ నెల 19న సీసీ రెడ్డి పాఠశాలలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. భారీ సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరై వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అనేక మంది యువతకు ఒకే వేదికపై పలు కంపెనీలను అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిరుద్యోగులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ అవకాశాలు లభించడంతో పలువురు యువత కళ్లలో ఆనందం కనిపించిందని, వారి కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయని స్థానికులు పేర్కొన్నారు.కోదాడతో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి కూడా యువత పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జాబ్ మేళా ప్రాంగణం సందడిగా మారింది. తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేశారు.యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళా ద్వారా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి దంపతులు రెండు నియోజకవర్గాల యువతను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారనే భావనను చాటుకున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. ఉద్యోగం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే కంపెనీలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతకు అవకాశాల వేదికగా నిలిచిన మెగా జాబ్ మేళా.. కోదాడలో కొత్త ఆశలకు బాటలు వేసిందని యువత పేర్కొంది.

# రూ.20.30 కోట్లతో కోదాడ హుజూర్‌నగర్ బస్‌స్టేషన్ల అభివృద్ధి

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక కృషి**



కోదాడ సెప్టెంబర్ 21(వుదయం)కోదాడ, హుజూర్‌నగర్ బస్‌స్టేషన్లను రూ.20.30 కోట్లతో ఆధునికీకరించనున్నట్లు మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోదాడలో ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.16.80 కోట్లు, హుజూర్‌నగర్ బస్‌స్టేషన్ పునరుద్ధరణకు రూ.3.50 కోట్లు కేటాయించారు.రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోదాడలో ఐదు ఎకరాల్లో ఆధునిక టెర్మినల్, విశాలమైన బస్‌బేలు, ప్రయాణికుల నిరీక్షణ ప్రాంగణం, పార్కింగ్, ఎలక్ట్రిక్ బస్సుల ఛార్జింగ్ పాయింట్లు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.
హుజూర్‌నగర్‌లోనూ ఆధునిక వసతులతో బస్‌స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు.పనులను వేగవంతం చేసి నాణ్యతలో రాజీపడకుండా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు మెరుగైన, సురక్షితమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు.సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీ రాజశేఖర్, చీఫ్ ఇంజనీర్ కవిత తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడితే ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు




జన్నారం,సెప్టెంబర్21(వుదయం విలేఖరి ) స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున జన్నారం మండలంలోని తపాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ కొల్లూరు కమలాకర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి, మూగజీవులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుందని, దానివల్ల భూమి నిస్సారంగా మారుతుందని తెలిపారు. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లు, కంటైనర్లలో తీసుకోవడం వల్ల విషపూరిత రసాయనాలు ఆహారంలో చేరి క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరించారు.వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లను ఇష్టానుసారంగా బయట పడేయడం వల్ల మురుగు కాలువలు మూసుకుపోయి నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తుంగూరి గోపాల్, ఆయుర్వేద వైద్యాధికారి డా. నాగదీపాంజలి, గ్రామ సర్పంచ్ మురిమడుగుల కవిత రాజన్న, ఉప సర్పంచ్ మామిడి రాజన్న, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు చంద్రిక, రామారావు, శ్రీనివాస్, ఆశా కార్యకర్త లలిత తదితరులు పాల్గొన్నారు.

# *డీజేలు వద్దు.. బ్యాండ్ మేళంతోనే నిమజ్జనాలు*



కోదాడ సెప్టెంబర్ 21 (వుదయం)వినాయక నిమజ్జనాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, బ్యాండ్ మేళాలతోనే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని కోదాడ రూరల్ ఎస్సై షేక్ యాకూబ్ సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.
నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.
“భక్తి ఉండాలి.. హంగామా వద్దు.. డీజేలు వద్దు.. బ్యాండ్ మేళంతోనే నిమజ్జనాలు నిర్వహించాలి” అని ఎస్సై యాకూబ్ స్పష్టం చేశారు.

# అన్నదానం.. మహా పుణ్యకార్యం



కోదాడ, సెప్టెంబర్ 21(వుదయం)అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని పెరిక నగర్‌లో మైలారపు శెట్టి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు.కార్యక్రమంలో కందిబండ ఎలమందరావు, చింతల శ్రీనివాసరావు, రమేష్, విష్ణుమూర్తి, సైదులు, వెంకన్న, హేమంత్, శ్రీనివాస్‌చారి, సైదారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం

**11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ**



కోదాడ, సెప్టెంబర్ 21(వుదయం)శంషాబాద్ నుంచి చెన్నై వరకు ప్రతిపాదిత బుల్లెట్ రైలు మార్గాన్ని సూర్యాపేట, కోదాడ మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుల్లెట్ రైలు, రైలు కారిడార్ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్–చెన్నై మధ్య ప్రతిపాదిత బుల్లెట్ రైలు కారిడార్ అత్యంత ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. ఈ మార్గాన్ని సూర్యాపేట–కోదాడ మీదుగా ఏర్పాటు చేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.కోదాడ, సూర్యాపేట ప్రాంతాలు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కీలక వాణిజ్య కేంద్రాలుగా ఉన్నాయని, ఈ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు వ్యాపార, విద్య, వైద్య అవసరాల కోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై నగరాలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. బుల్లెట్ రైలు మార్గం ఈ ప్రాంతాల మీదుగా వస్తే ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని పరిశీలించి సూర్యాపేట–కోదాడ మీదుగా బుల్లెట్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మద్దతును కూడగట్టేందుకు చేపట్టిన సంతకాల సేకరణలో వచ్చిన సంతకాలను ప్రధానమంత్రి, కేంద్ర రైల్వే మంత్రి, ముఖ్యమంత్రికి పంపనున్నట్లు సాధన సమితి నాయకులు తెలిపారు.కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ కనగాల నారాయణ, మాజీ మండల అధ్యక్షుడు దేవరశెట్టి సత్యనారాయణ, చింతా బాబు మాదిగ, త్రిపురశెట్టి రాజు, పోలిశెట్టి కృష్ణయ్య, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, పసుపులేటి రామారావు, నూనె సులోచన, డాక్టర్ ప్రసాద్ (ఈఎన్‌టీ), సలికంటి రామారావు, దేవరశెట్టి బ్రహ్మయ్య, పంది తిరపయ్య, సైదా నాయక్, నాగేంద్రచారి, ఏపూరి సత్యరాజు, ఓరుగంటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.బీజేపీ, సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, జనసేన, ఎంఆర్‌పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలతో పాటు హమాలీ, శాలివాహన, యాదవ తదితర సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సంతకాలు చేశారు.

# సర్ లో అక్రమంగా ఓటు నమోదుకు యత్నం

***విచారణ చేయాలని కలెక్టర్ కు పిర్యాదు***



జన్నారం,సెప్టెంబర్21(వుదయం విలేకరి ) జన్నారం మండలం కవ్వాల్ గ్రామ పంచాయతీలో ఓటరు జాబితా నమోదు (సర్) లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని సర్పంచ్ లకావత్ సక్కు నాయక్ ఆరోపించారు. సోమవారం రోజున మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సక్కు నాయక్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కవ్వాల్ గ్రామ పంచాయతీగా ఉన్న తమ పంచాయతీ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం మూడు పంచాయతీలుగా విభజించడం జరిగిందని, కవ్వాల్ గ్రామపంచాయతీ నుండి హాస్టల్ తండా, బంగారు తండా గ్రామపంచాయతీ లు ఏర్పడ్డాయని అన్నారు.ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రక్రియలో స్థానికంగా నివాసం లేని కొందరు వ్యక్తులు, ఇతర పంచాయతీలకు చెందిన వారు తమ పంచాయతీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారికి గ్రామంలో నివాసం, ఇంటి పన్ను, రేషన్ కార్డు వంటి ఎలాంటి ఆధారాలు లేవని, కొందరు తప్పుడు, అనుమానాస్పద పత్రాలను సమర్పిస్తున్నారని ఆరోపించారు. కావున ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల నివాస స్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారు సమర్పించిన పత్రాల నిజానిజాలను ధృవీకరించాలని కోరారు. విచారణలో నివాసం లేని వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఓటు నమోదుకు ప్రయత్నించినట్లు తేలితే చట్టపరంగా, ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కబ్జాకు గురైన చెరువును కాపాడాలని రిలే నిరాహార దీక్ష



జన్నారం,సెప్టెంబర్21(వుదయం విలేకరి)జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామ అల్లం వారి కుంట కబ్జాకు గురైందని,కబ్జాకు గురైన చెరువును పరిరక్షించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు సోమవారం రోజున రేండ్లగూడ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేండ్లగూడ గ్రామ శివారులో సర్వేనెంబర్ 160, 161 లో ఉన్న 24 ఎకరాల కుంట కబ్జాకు గురై ప్రస్తుతం రెండు ఎకరాలు మాత్రమే మిగిలిందని, ఇట్టి విషయంపై కలెక్టర్ కు ఇరిగేషన్ అధికారులకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో కొన్ని రోజుల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అల్లం వారి కుంట ను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, చెరువుకు పూర్వ వైభవం వచ్చేదాకా పోరాటం ఆపేదే లేదని అన్నారు.ఈ రిలే నిరాహారదీక్ష లో సముద్రాల శంకర్,దాసరి తిరుపతి, అల్లం పెద్దన్న, ఆకుల మధు, వెయికండ్ల రవి, పవన్,సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**వరంగల్ విమానాశ్రయానికి బాపూజీ పేరు పెట్టాలని డిమాండ్**

అమీన్‌పూర్ (వుదయం): బీరంగూడఅమీన్‌పూర్ పట్టణ పద్మశాలి సంఘం మరియు అమీన్‌పూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు శ్రీ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వరంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీరంగూడ లోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ శ్రీ భావనాఋషి పద్మశాలి భవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాటాడుతూ, కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమానికి, బడుగు బలహీన వరాల అభ్యున్నతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే వరంగల్‌లో ప్రతిపాదితంగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెటాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బాపూజీ సేవలను చిరస్మరణీయంగా నిలబెట్టేందుకు ఇది సముచిత గౌరవమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆడేలి రవీందర్, కోకాల శ్రీనివాస్ మాకం మల్లేష్, అమీన్‌పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కుంట యెల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, అమీన్‌పూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం యాదగిరి, ప్రధాన కార్యదర్శి చేన్న మోహన్, సంఘం కార్యకర్తలు, సభ్యులు, కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని బాపూజీకి ఘన నివాళులర్పించారు.



# గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలి

- సి సి కెమెరాలతో నిరంతర నిఘా: ఎస్పీ కె. నరసింహ
- బుధవారం నాటికి అన్ని విగ్రహాల నిమజ్జనాలు పూర్తి చేయాలి
- డీజేలకు పూర్తి నిషేధం, నిమజ్జన బందోబస్తుకు 1200 మంది పోలీసులు

సూర్యాపేట
సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి



గణేష్ నవరాత్రులు జిల్లాలో అత్యంత రక్షణ భద్రత నడుమ భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయని, బుధవారం రోజున జిల్లా వ్యాప్తంగా నిమజ్జనాలు జరుగనున్న నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఐపిఎస్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా శోభాయాత్ర నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. గణేష్ మండపాలకు జియో ట్యాగింగ్ చేసి నంబర్లు కేటాయించాం. జిల్లాలో ఎక్కడైనా 10 నిమిషాల్లో పోలీసు సేవలు అందేలా పెట్రో కార్, బ్లూ కోల్ట్, హైవే పెట్రోలింగ్, బీట్ సిస్టమ్ ను బలోపేతం చేశాం. అత్యవసర సమయంలో డయల్ 112 కు ఫోన్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3150 విగ్రహాలకు అనుమతి ఇచ్చాం. సూర్యాపేట పట్టణంలో సద్దల చెరువు, మూసీ రివర్ రత్నాపురం, కోదాడ పెద్ద చెరువు, మట్టపల్లి బ్రిడ్జి, మహంకాళిగూడెం కృష్ణానది, చిట్యాలపల్లి బ్రిడ్జి వద్ద భారీ బందోబస్తు, క్రేన్లు, లైటింగ్, గజ ఈతగాళ్ల ఏర్పాట్లు పూర్తి చేశాం. బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టం దొరకలేదనే కారణంతో నిమజ్జనాలను వాయిదా వేయవద్దు. బుధవారం ఉదయమే త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలి. గ్రామాల్లో కమిటీలు స్థానిక చెరువులు, కుంటల్లోనే నిమజ్జనం చేసుకోవడం మంచిది. అధిక శబ్దం వల్ల వినికిడి లోపం, గుండెపోటు వంటి ప్రమాదాలు ఉన్నందున డీజేలకు అనుమతి లేదు. వాడితే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్ర జరుపుకోవాలి. అడిషనల్ ఎస్పీలు, 3 డీఎస్పీలు, 15 సీఐలు, 60 ఎస్సైలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏఆర్ సిబ్బందితో కలిసి 1200 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారు. సీసీటీవీలు, వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీతో పర్యవేక్షణ ఉంటుంది. మద్యం మత్తులో శోభాయాత్రలో పాల్గొనవద్దు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయి. ఎత్తైన విగ్రహాలు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు, మహిళలు, వృద్ధులు, ఈతరాని వారు నిమజ్జన ప్రాంతానికి దూరంగా ఉండాలి. ఎల్ నినో ప్రభావంతో నీటి వనరులు తక్కువగా ఉన్నందున నీటిని కలుషితం చేయవద్దు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

సత్తుపల్లి సెప్టెంబర్ 21: ( వుదయం ప్రతినిధి )



వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని పలు గణపతి మండపాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ గణపతి మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులతో ఆయన మాట్లాడారు. వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహాన్ కమల్ పాషా, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవ రావు, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య



భద్రాచలం 21/9/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య సందర్శించి శ్రీ సీతారామచంద్రస్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీ సీతారామచంద్ర స్వామివారి విశిష్టతను, ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు, ప్రత్యేక ఉత్సవాల గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలని శ్రీ సీతారామచంద్రస్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యతను ఆయన కొనియాడారు. స్వామివారి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ మెగా జాబ్ మేళాపై పూర్తి సమాచారం ఇవ్వాలి

### కాపర్తి మణికంఠ కుమార్

కోదాడ, సెప్టెంబర్ 21 (వుదయం):-



కోదాడలో జిల్లా ఉపాధి కార్యాలయం, కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సామాజిక కార్యకర్త కాపర్తి మణికంఠ కుమార్ కోరారు. జాబ్ మేళా నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై సమాచారాన్ని కోరుతూ ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు సమర్పించినట్లు ఆయన తెలిపారు. జాబ్ మేళా నిర్వహణకు తీసుకున్న అనుమతులు, ప్రభుత్వ నిధుల కేటాయింపు జరిగిందా లేదా, ఒకవేళ నిధులు కేటాయిస్తే ఎంత మొత్తం కేటాయించారు, ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు, ఖర్చులకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, చెల్లింపుల వివరాలను అందించాలని కోరినట్లు తెలిపారు. అలాగే జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల పూర్తి జాబితా, ఆయా కంపెనీల ద్వారా అందుబాటులో ఉంచిన ఉద్యోగాల వివరాలు, ఉద్యోగాల సంఖ్య, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన సమాచారం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య తదితర వివరాలను వెల్లడించాలని కోరారు. అదేవిధంగా జాబ్ మేళా నిర్వహణలో విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బంది, వాలంటీర్ల వివరాలు, వారి హాజరు రికార్డులు, కార్యక్రమానికి సంబంధించిన అధికారిక నివేదికలు, సమావేశాల వివరాలు, ఇతర పరిపాలనా రికార్డులను కూడా అందించాలని దరఖాస్తులో కోరినట్లు కాపర్తి మణికంఠ కుమార్ తెలిపారు. జాబ్ మేళా నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు అందాయా, అధికార దుర్వినియోగంపై ఏవైనా విచారణలు జరిగాయా, విచారణ జరిగితే అందుకు సంబంధించిన నివేదికలు, తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను కూడా అందించాలని కోరినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండటం అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే అభ్యర్థుల వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన గోప్యత, డేటా ప్రైవసీ నిబంధనలను గౌరవిస్తూ, చట్టప్రకారం బహిర్గతం చేయగల అధికారిక రికార్డులు, సమగ్ర గణాంకాలు, ఆర్థిక వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కాపర్తి మణికంఠ కుమార్ కోరారు.



## లింగపాలెంలో పోషణ మాసం కార్యక్రమం

సత్తుపల్లి సెప్టెంబర్ 21 ( వుదయం ప్రతినిధి)

పోషణ మాసంలో సందర్భంగా వేంసూరు మండల పరిధిలోని లింగపాలెం గ్రామపంచాయతీలో లింగపాలెం 3 అంగన్వాడి కేంద్రం నందు సత్తుపల్లి సిడిపిఓ బి సత్యవతి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడమైనది ఈ కార్యక్రమం లింగపాలెం గ్రామ సర్పంచ్ ఎర్ర రమేష్, ఉప సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించడమైనది, ఈ కార్యక్రమంలో భాగంగా తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సత్యవతి మాట్లాడుతూ మనిషి జీవించటానికి తీసుకోవలసినటువంటి ఆహారం పోషక విలువలు కోల్పోకుండా వండే విధానం గురించి మరియు గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు తీసుకోవలసిన ఆహారం గురించి వివరించినారు. తదుపరి ఇద్దరు గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి వారికి తగు జాగ్రత్తలు సూచించారు. మరియు ముగ్గురు పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించి అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేశారు . ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కమల, పంచాయతీ సెక్రెటరీ రవితేజ,గ్రామ పెద్దలు , తల్లులు, మరియు అంగన్వాడీ టీచర్లు , జీవమ్మా, లక్ష్మి , విజయ దనమ్మ గ్రామ పెద్దలు తల్లులు పాల్గొన్నారు.

## భద్రగిరి మార్ట్‌లో ఆర్గానిక్, సేంద్రియ ఉత్పత్తులు బాగున్నాయి

### తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

భద్రాచలం 21/9/26 వుదయం ప్రతినిధి:




భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులతో పాటు గిరిజన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న సంప్రదాయ ఉత్పత్తులకు మంచి మార్కెట్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు వారి ఉత్పత్తులకు సరైన గుర్తింపు, మార్కెట్ కల్పించేందుకు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. సోమవారం భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్‌ను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి చైర్మన్ బక్కి వెంకటయ్య సందర్శించారు. ఈ సందర్భంగా మార్ట్‌లో అందుబాటులో ఉంచిన వివిధ రకాల అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, గిరిజన మహిళల స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న వస్తువులను ఆయన పరిశీలించారు. మార్ట్‌లో లభిస్తున్న ఉత్పత్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. . ప్రతి ఒక్కరూ భద్రగిరి మార్ట్‌ను సందర్శించి అక్కడ లభించే ఉత్పత్తుల గురించి తెలుసుకోవాలని, వీలైనంత వరకు గిరిజన మహిళలు, గిరిజన రైతులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కోరారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారత, స్థానిక ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా భద్రగిరి మార్ట్ మరింత అభివృద్ధి చెందాలని బక్కి వెంకటయ్య ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భద్రగిరి మార్ట్ నిర్వాహకులు, సిబ్బంది చైర్మన్‌కు మార్ట్‌లోని వివిధ ఉత్పత్తులను చూపించి వాటి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏవో సున్నం రాంబాబు, భద్రగిరి మార్ట్ మేనేజర్ జయరాజ్, విజిలెన్స్ కమిటీ మెంబర్ వెంకటేశ్వర్లు, భద్రగిరి మార్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 48 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి

నల్లగొండ జిల్లా
వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 21:



నల్లగొండ పట్టణంలోని 37వ డివిజన్ రవీంద్రనాథ్ కాలనీలో 48 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పట్టణ తొలి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి అన్నారు. ఏటా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన వినాయక పూజా కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కాలనీవాసులు 48 ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తిభావంతో ఉత్సవాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, కార్పొరేటర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, నంద్యాల బ్రహ్మానందరెడ్డి, అయితగోని శివ, గాలి నాగరాజు, పురుషోత్తం, సంపత్ తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## డీజే శబ్దంతో కాదు.. సేవతో యువత ఉనికిని చాటాలి

### విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్

మునగాల సెప్టెంబర్ 21 (వుదయం):-



పండుగల పేరుతో డీజేలు, భారీ శబ్దాలతో హంగామా చేయడం యువతకు గొప్పతనం కాదని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడమే నిజమైన యువశక్తికి నిదర్శనమని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్ అన్నారు. గణేష్ నిమజ్జనం, కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు వంటి పండుగల సమయంలో భక్తిని చాటుకోవడానికి భారీ శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. దేవుడిపై భక్తిని డీజే శబ్దం నిర్ణయించదని, మన ప్రవర్తన, మంచి పనులే భక్తికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత ఉత్సాహంగా పండుగల్లో పాల్గొనాలని, అదే సమయంలో సమాజం పట్ల బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. డీజే శబ్దాల కారణంగా పక్కింటి చిన్నారులు నిద్రకు దూరం కావడం, వృద్ధులు ఇబ్బందులు పడటం, అనారోగ్యంతో ఉన్నవారు అసౌకర్యానికి గురికావడం, విద్యార్థులు చదువుకోలేకపోవడం వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని కోరారు. డీజేలకు ఖర్చు చేసే డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని సుధాకర్ గౌడ్ అన్నారు. అదే డబ్బుతో పేద విద్యార్థులకు పుస్తకాలు అందించవచ్చని, పేద కుటుంబాలకు భోజనం పెట్టవచ్చని, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని తెలిపారు. పండుగ ముగిసిన తర్వాత కూడా ఎవరికైనా ఉపయోగపడేలా చేసే సేవే నిజమైన పండుగకు అర్థమని అన్నారు. పండుగల సమయంలో ఉత్సాహాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం లేదని, అయితే ఇతరుల ప్రశాంతత, భద్రతకు భంగం కలగకుండా నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. యువత మారితే సమాజంలో మార్పు వస్తుందని, భక్తిని శబ్దంతో కాకుండా ప్రవర్తనతో, ఉత్సాహాన్ని హంగామాలో కాకుండా సేవలో చూపించాలని సుధాకర్ గౌడ్ అన్నారు.

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

- గ్రామ ప్రజలకు ఉచిత షుగర్ పరీక్షలు, మందుల పంపిణీ
- ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డా. రవి నాయక్ సందర్శన

సూర్యాపేట జిల్లా
సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి






అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా లక్ష్మీ నాయక్ తండాలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ, భారతీయ సనాతన వైద్య విధానమైన ఆయుర్వేదం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని తెలిపారు. ఆయుర్వేదంలో సూచించిన దినచర్య, ఋతుచర్యలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన జీవనశైలికి ఇవి ఎంతో ఉపయోగకరమని వివరించారు. పాల్గొన్న ప్రజలందరికీ ఉచితంగా రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించారు. వాతవ్యాధులు, కీళ్ల నొప్పులు, అజీర్ణం, చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలు, మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయుష్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి నాయక్ విచ్చేసి శిబిరాన్ని సందర్శించి అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నాయక్ తండా సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే వట్టికం పహాడ్ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది భూషణం, ఉపేంద్ర, నాగలక్ష్మి , ఉప్పలయ్య శిబిర నిర్వహణలో సహకరించారు.

## గణేష్ మండపాలను దర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

సత్తుపల్లి సెప్టెంబర్ 21 ( వుదయం ప్రతినిధి )





సత్తుపల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య పలు గణేష్ మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ రోడ్, బైపాస్ రోడ్, తుమ్మూరు రామారావు వీధి, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి గణనాథునికి పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లో ముత్యాలమ్మ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సండ్ర వెంకట వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుని ఆశీస్సులతో సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సండ్ర వెంకట వీరయ్య ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారె



**యాతాలకుంట టన్నెల్ పనుల పర్యవేక్షణ..**
**చాపరాలపల్లి వద్ద హై లెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన**

దమ్మపేట సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):

సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ముందుగా యాతాలకుంట వద్ద కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల వివరాలను అధికారులు వారికి వివరించారు. అనంతరం ములకలపల్లి మండలం చాపరాలపల్లి వద్ద నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. తదుపరి కమలాపురం వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. సీతారామ ప్రాజెక్టు పనుల ద్వారా సాగునీటి సౌకర్యాలు మెరుగుపడి, రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కొంగర రమేష్ ఆకస్మిక మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

### బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్

మధిర, సెప్టెంబర్,21, వుదయం, ప్రతినిధి:

మధిర మండలం మల్లారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మధిర సొసైటీ డైరెక్టర్ కొంగర రమేష్ విద్యుత్ షాక్‌కు గురై ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన కొంగర రమేష్ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు,పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారని, ఆయన ఆకస్మిక మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు,కరివేద రాంబాబు,కరివేద శ్రీకాంత్, మట్టూరి దుర్గ శ్రీనివాస్, సాకి దుర్గాప్రసాద్, మోరబోయిన కిషోర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మునగాల పీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలి




- 24 గంటల ప్రథమ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి
- బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతి

మునగాల, సెప్టెంబర్ 21 (వుదయం):-

మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఖాళీగా ఉన్న సుమారు ఎనిమిది కేటగిరీలకు చెందిన ఉద్యోగ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరుతూ మునగాల మండల ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత కారణంగా అత్యవసర సమయాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. మునగాల మండల కేంద్రం జాతీయ రహదారి–65పై ఉండటంతో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, జాతీయ రహదారి దాటే సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న జాతీయ రహదారి ప్రాంతం ప్రమాదాలకు కేంద్రంగా మారిందని, ప్రమాదాల్లో పలువురు గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తక్షణ వైద్యం అందించేందుకు అవసరమైన స్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు పీహెచ్‌సీలో 24 గంటల పాటు పూర్తిస్థాయిలో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా అత్యవసర రక్త అవసరాలను దృష్టిలో ఉంచుకుని మునగాల పీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంక్ లేదా రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజావాణి దరఖాస్తులో కోరారు. మండల ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి, పీహెచ్‌సీని పూర్తిస్థాయి వైద్య సేవలు అందించే కేంద్రంగా అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మునగాల జనవేదిక కన్వీనర్ మరువాడ ఆంజనేయ శర్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, ఎస్‌కే పాషా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పంటలను దూరం చేస్తున్న పాపం కాంగ్రెస్‌దే

- **మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఫైర్**
- **పెన్ పహాడ్ లో ఎండిన పొలాలను పరిశీలించిన జగదీశ్ రెడ్డి**
- **చీదెళ్ల సబ్ స్టేషన్ లో లాగ్ బుక్ తనిఖీ చేసి అధికారులపై ఆగ్రహం**

**పెన్ పహాడ్ / సూర్యాపేట సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**



రైతుల కష్టాలు పట్టని రేవంత్ సర్కార్ పై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి నిప్పులు చెరిగారు. పెన్ పహాడ్ మండలం నూర్జహాన్ పేట, గూడెపుకుంట తండా గ్రామాల్లో వందల ఎకరాల్లో ఎండిపోయిన వరి పొలాలను సోమవారం ఆయన స్వయంగా పరిశీలించారు. పొలాల్లోకి దిగి రైతులతో మాట్లాడి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీదెళ్ల సబ్ స్టేషన్ కు వెళ్లి కరెంట్ సరఫరాకు సంబంధించిన లాగ్ బుక్ ను పరిశీలించి, రైతులకు సరిగ్గా కరెంట్ ఇవ్వకపోవడంపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏకిపారేశారు. ఏ గ్రామంలో చూసినా వందల ఎకరాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితి చూసి రైతులు సగం పొలాలే నాటు పెట్టుకుంటే, అందులో సగం పంటలు ఎండే పరిస్థితి వచ్చింది. దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమే. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్టుంది ఈ ప్రభుత్వ పాలన. నీళ్లు, కరెంట్ పుష్కలంగా ఉన్నా కావాలనే పంటలు ఎండబెడుతున్నారు. ఉన్న కరెంటును కూడా సరిగ్గా ఇవ్వకపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయి. ఇది రైతుల పట్ల కక్షపూరిత చర్య.

ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ దయ్యం, రేవంత్ భూతం పట్టింది. ఆ దయ్యాలను ఎలా వదిలించాలో రైతులకు తెలుసు. కన్నేపల్లి పంప్ హౌస్ ఇప్పుడు స్విచ్ ఆన్ చేసినా నీళ్లు సరిపడా ఉన్నాయి. 24 గంటల కరెంట్ ఇవ్వడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి, అయినా ఇవ్వడం లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, నా మీద దాడులు చేస్తే ఎండిన పొలాలు మళ్లీ పారుతాయా? మీ డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయా? పంటలు చేతికొచ్చే సమయంలోనే కావాలనే ఎండబెడుతున్నారు. మీడియా సంస్థల విలేకరులను గ్రామాల్లో తిప్పి ఎండిన పొలాల వాస్తవాలను ప్రజలకు చూపాలని జగదీష్ రెడ్డి కోరారు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం ముందుకు సాగలేదని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించుకుని పదేళ్లు సస్యశ్యామలంగా పంటలు పండించుకున్నామని, మళ్లీ పంటలు కాపాడుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం తప్పదని తేల్చి చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల కోసం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా

**బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గోలి ప్రభాకర్**

**నల్గొండ జిల్లా, వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 21**



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు సోమవారం గ్రీవెన్స్ డే లో దివ్యాంగుల సంఘాల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ దివ్యాంగుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా లో రాష్ట్ర బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గోలి ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన దివ్యాంగుల హక్కుల కోసం మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి ఒక్క నియమనిబంధనలకు కట్టుబడి ఉండాలని లేకుంటే పోతే దివ్యాంగుల అందరితో అసెంబ్లీ ముట్టడించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు

## కులమతాలకు అతీతంగా అన్నదానం అభినందనీయం



- **ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి**
- **31వ వార్డు తిరుమల నగర్ లో ముస్లిం కుటుంబం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి అన్నదానం - మతసామరస్యానికి ప్రతీక**

**సూర్యాపేట సెప్టెంబర్ 21, వుదయం ప్రతినిధి**

కులమతాలకు అతీతంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 31వ వార్డు తిరుమల నగర్ రోడ్డు నెంబర్ 31లో ఎస్పీ నరసింహ స్పెషల్ గన్‌మెన్ నాగుల్‌మీరా సమీనా ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లింలు సైతం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అన్నదానం నిర్వహించడం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇది చక్కని నిదర్శనమని కొనియాడారు. ప్రజలంతా సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలని, వినాయక నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంబిబిఎస్ సీటు సాధించిన పేద విద్యార్థి ఉపేందర్

**మధిర, సెప్టెంబర్,21, వుదయం, ప్రతినిధి:**





ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ప్రతిభతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన దళిత పేద కుటుంబానికి చెందిన గుడిపూడి ఉపేందర్‌ను సోమవారం ఖమ్మంపాడు ప్రభుత్వ హైస్కూల్లో ఘనంగా సన్మానించారు. ఖమ్మంపాడు పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని బోనకల్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు.నీట్ లో 526 మార్కులు సాధించి ఉస్మానియా యూనివర్సిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించారు.ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ పట్టుదలతో చదివి ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల ఖమ్మంపాడు పాఠశాలలు ఉపాధ్యాయులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థి వైద్య విద్యలో సీటు సాధించడం గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు.పేదరికం చదువుకు అడ్డంకి కాదని ఉపేందర్ నిరూపించారని, కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని పలువురు అన్నారు. ఉపేందర్ విజయం గ్రామంలోని విద్యార్థులకు, ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలకుస్ఫూర్తిదాయకమని తెలిపారు.ఈ సందర్భంగా ఉపేందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సర్పంచ్ బి అంజన బాబు పి ఆర్ టి యు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రేగళ్ల బ్రహ్మారెడ్డి, మదార్,సునిత జమీర్ గ్రామ పెద్దలు రామారావు జానయ్య బాలు మధిర ప్రధాన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోశాధికారి పాగి బాలస్వామి,పల్లపోతు ప్రసాదరావు, సీనియర్ పాత్రికేయులు ముమ్మా మురళి తదితరులు పాల్గొన్నారు.



## భజరంగ్ వ్యాయామశాల అన్న దాన కార్యక్రమంలో చింతల్

**యాదాద్రి భువనగిరి జిల్లా, 21 సెప్టెంబర్ 2026**

భజరంగ్ వ్యాయామశాల భువనగిరి గంజ్ గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్న ప్రసాదాలను స్వీకరించారు. నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ సుమారు 1,000 మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం భజరంగ్ వ్యాయామశాల ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ రోజు అన్నదాన కార్యక్రమాన్ని వెంకటేష్‌గారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ వ్యాయామశాల సభ్యులు గౌరింకల శివశంకర్, సరగడ కరుణ్, సరగడ అమర్,దశరథ, ముత్యాల సాయికిరణ్ యాదవ్, ముత్యాల లక్ష్మీనారాయణ,దత్తు యాదవ్, సరగడ రాము, రంగా కృష్ణ, సరగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లస్సీ రుచికరమైన పానీయాలు ప్రారంభోత్సవం

**నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

**నల్లగొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 21**



నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో నూతన లస్సీ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. 1986 నుంచి రుచికరమైన పానీయాలు, మధురమైన అనుభూతులకు చిరునామాగా నిలిచిన లస్సీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లస్సీ షాప్ వ్యవస్థాపకులు ఎర్రబోతు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నల్లగొండ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య–శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి లస్సీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వినియోగదారులకు చల్లటి లస్సీతో పాటు వివిధ రకాల ఐస్‌క్రీమ్‌లు, రుచికరమైన బటర్‌మిల్క్ వంటి ఆరోగ్యకరమైన పానీయాలను అందించేందుకు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. లస్సీ షాప్ వ్యవస్థాపకులు ఎర్రబోతు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. చాక్లెట్, వెనిల్లా, స్ట్రాబెర్రీ తదితర రుచులతో పాటు ఆకర్షణీయమైన అలంకరణలు, తీపి పదార్థాల మేళవింపుతో ఐస్‌క్రీమ్ ప్రియులను ఆకట్టుకునేలా కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచులను ఆస్వాదించేలా ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 1986 నుంచి కొనసాగుతున్న రుచుల ప్రస్థానాన్ని మరింత విస్తరించే దిశగా ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, 8వ డివిజన్ కార్పొరేటర్ వజ్జ సంతోషిని రమేష్, కార్పొరేటర్ అల్లి సుభాష్ చంద్రబోస్, లయన్స్ క్లబ్ గవర్నర్ సంతోష్ కోడె, పట్టణ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, ఎర్రబోతు అశోక్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, గట్టుపల్లి రవీందర్‌రెడ్డి, 9వ వార్డు అధ్యక్షుడు పిల్లి రమేష్, 5వ డివిజన్ కార్పొరేటర్ పున్న గణేష్‌తో పాటు బంధువులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత**

**మధిర, సెప్టెంబర్ ,21, వుదయం, ప్రతినిధి:**






మధిర ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మధిర మున్సిపాలిటీ,ఇల్లందులపాడులో ఆయుర్వేద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ నెల 23న ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకలను చేపట్టారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ,నాలుగు వేదాలలో ఒకటైన ఆయుర్వేదం ఎలాంటి కోత, కుట్టు లేకుండానే మానవ శరీరంలోని రుగ్మతలను తొలగించి పరిపూర్ణ దీర్ఘాయుష్షును ప్రసాదిస్తుందని కొనియాడారు.నేడు ప్రపంచ దేశాల నడుమ భారతదేశ కీర్తిప్రతిష్టలు నలుదిశలా వ్యాప్తి చెందడానికి, నాటి నుంచి మనం ఆచరిస్తూ వస్తున్న ఆయుర్వేద సూత్రాలు కూడా ఒక ప్రధాన కారణమనిపేర్కొన్నారు.ప్రకృతిలో లభించే సహజసిద్ధమైన ఔషధాలను ఉపయోగించి ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) లేకుండా వైద్యం అందించడంతో పాటు,విరిగిన ఎముకలను సైతం సహజ పద్ధతిలో అతికించడం మన ఆయుర్వేద వైద్య విధానానికి మాత్రమే సాధ్యమని ఆమె వివరించారు. నిజానికి, ఆయుర్వేదం అమ్మ ప్రేమ వంటిది, ఎలాంటి హాని తలపెట్టకుండా, ఒంటికి రోగాలొచ్చినప్పుడు అక్కున చేర్చుకుని నిదానంగా నయం చేస్తుంది. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆయుర్వేదం వైపు చూస్తున్నాయని, ఈ నెల 23న జరగనున్న ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఈ ప్రాచీన వైద్య విధానం మరింత విస్తృతంగా ప్రపంచవ్యాప్తం కానుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వెంకట్‌లాల్, డాక్టర్ పృథ్వి నాయక్, కాంగ్రెస్ నాయకులు సామినేని రామనాథం, సూర్యదేవర కోటేశ్వరరావు, ఎర్రగుంట రమేష్, కోట డేవిడ్, తాళ్లూరు రాధా కుమార్, కందుల రాంబాబు, ఎస్.డి.అన్సర్, గణేష్ బాబు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి

**మధిర, సెప్టెంబర్,21, వుదయం, ప్రతినిధి:**

మధిర మండలం ఇల్లూరు గ్రామంలో మాజీ కేంద్ర మంత్రి,రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి సహకారంతో రూ.4 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేణుకా చౌదరి సహకారంతో గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, సీసీ రోడ్లు, లైటింగ్, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజావాణి లో రెండు దరఖాస్తులు

**అనంతగిరి, సెప్టెంబర్ 21 వుదయం**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో సుష్మ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సుష్మ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి రెండు పిటిషన్లు మాత్రమే అందినట్లు తెలిపారు. వచ్చిన పిటిషన్లపై ఎలాంటి రిమార్కులు నమోదు కాలేదన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 16 మంది అధికారులు పాల్గొన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- **గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**
- **నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**

**సూర్యాపేట సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి**



గణేష్ నిమజ్జనాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాధి , స్థానిక డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైర్, పోలీస్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను అందరూ కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు ముందస్తుగా నిమజ్జనానికి బయలుదేరి, వీలైనంత త్వరగా నిమజ్జనం పూర్తి చేసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండాలని, వాహనాలపై పిల్లలను ఎక్కించరాదని స్పష్టం చేశారు. వృద్ధులు, మహిళలు నిమజ్జన ప్రదేశాలకు దూరంగా ఉండి భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాల కోసం జిల్లాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రదేశంలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అన్ని కోణాల్లో భద్రతా చర్యలు చేపట్టి పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. యువత, ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశంలో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మున్సిపల్ సిబ్బందితో నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టి నిమజ్జన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఆర్డిఓ వేణు మాధవరావు, స్థానిక డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ, రూరల్ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఫైర్ ఎస్ఐ జానయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనంతల కృపాకర్ సభ్యులు రంగరాజు రుక్మారావు చల్ల మల్ల నరసింహ కౌన్సిలర్లు గండూరి రమేష్ కుమ్మరకుంట్ల వేణు కొనతం రాజేష్ రెడ్డి రాపర్తి శీను, ఈఈ కిరణ్, డి ఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలేష్, మున్సిపల్ మేనేజర్ ఎం బుచ్చిబాబు అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కారింగుల ఉపేందర్, బండపల్లి పాండురంగ చారి,తన్నీరు వాసు,కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సూర్యాపేట నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**టీచర్లకు బోధనలో మెళకువలు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహనకు అండగా ఉంటాం: అధ్యక్షుడు రామ్ సుధీర్ రెడ్డి**

**సూర్యాపేట సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి**



సూర్యాపేట పట్టణంలోని సిటీ హై స్కూల్ నందు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రామ్ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, టీచర్లకు అవసరమైన సహాయాన్ని, బోధనలో అవసరమైన మెళకువలను, ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న కార్యక్రమాలను వారికి చేరవేసేందుకు తమ అసోసియేషన్ అండగా ఉంటుందని అన్నారు. నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడు:బి. రామ సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి: పబ్బతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు:ఎస్.కె. షైనాజ్, సిహెచ్. వెంకయ్య, కార్యదర్శులు: కె. రామకృష్ణ, ఎస్కే కాసిం, కె.వి. సత్యనారాయణ, జె. జాన్ విల్సన్, జానకి రాములు, మధు, ట్రెజరర్: ఎం. సైదులు

మీడియా ఇంచార్జ్: వర్దెల్లి కృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్లు: డి. రవికుమార్, టి. విజయ్ కుమార్, బి. శ్రీనివాసచారి, గురు చరణ్, నాగరాజు

# స్వయం నియంత్రణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి



**ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి**

**మధిర, సెప్టెంబర్,21, వుదయం, ప్రతినిధి:**

మధిర కిష్టాపురంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి,మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ స్వయం నియంత్రణతో చదువుపై దృష్టి సారించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాలు మనిషిని బానిసగా మార్చి ఆరోగ్యం, భవిష్యత్తును దెబ్బతీస్తాయని, విద్యార్థులు తమ చుట్టూ ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారిని సరైన మార్గంలోకి తీసుకురావాలని అన్నారు. ఎక్సైజ్ సీఐ బాలకిషన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, జేవీపీ సంజీవరావు,సీనియర్ అధ్యాపకులు కొక్కిరేణి సత్యం, నాగేశ్వరరావు, రామయ్య, ఉపాధ్యాయులు సామ్సన్, రేణుక, రాధిక, శరత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జన ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం

**జిల్లా సుపరేండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**

**జగిత్యాల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**




గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిమజ్జనోత్సవ బందోబస్తులో ట్రాన్స్‌జెండర్లను భాగస్వామ్యం చేస్తూ ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా సుపరేండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించిన ఎస్పీ గణేశ్ నిమజ్జనోత్సవ బందో బస్తులో ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించనున్న 17 మంది ట్రాన్స్‌జెండర్లకు టీ షర్ట్‌లను అందజేశారు అనంతరం వారికి విధుల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు మార్గదర్శకాలను అందించారు గణేశ్ నిమజ్జనం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు గణేష్ విగ్రహాలు తరలివచ్చే ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ సిబ్బందితో కలిసి ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో పాల్గొంటారని తెలిపారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన బందోబస్తులో ట్రాన్స్‌జెండర్లను భాగస్వామ్యం చేయడం ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి గౌరవం మర్యాద సమానత్వం కల్పించాలనే సానుకూల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని తెలిపారు సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు గౌరవప్రదమైన జీవనం లభించాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ తరపున ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు ప్రజల భద్రత ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి బాధ్యతాయుతమైన విధుల్లో వారు పోలీస్ సిబ్బందితో కలిసి పని చేయడం అభినందనీయమని తెలిపారు జిల్లాలో గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృతమైన బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టిందని తెలిపారు నిమజ్జన మార్గాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ట్రాఫిక్‌ను సజావుగా కొనసాగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు గణేశ్ నిమజ్జనోత్సవానికి వచ్చే భక్తులు ప్రజలు పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా క్రమశిక్షణతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ ట్రాన్స్‌జెండర్ లు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్టులు సీఎం బంధువులకే కొప్పుల ఈశ్వర్




- కాంగ్రెస్ హయాంలో బొగ్గు పరిశ్రమ సర్వనాశనం..
- కేసీఆర్ హయాంలో 30 వేల పట్టాలిచ్చాం

పెద్దపల్లి, (గోదావరిఖని) సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)

సింగరేణి బొగ్గు పరిశ్రమలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంధువులకే పెద్ద కాంట్రాక్టు పనులు అప్పగించారని మాజీ మంత్రి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఓబీ కాంట్రాక్టులతో పాటు పలు పనులను సీఎం బంధువులు పొందారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనలో దయలేని ప్రభుత్వం కొనసాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు పరిశ్రమను సర్వనాశనం చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి ప్రాంతంలో వేలాది ఇళ్లకు యాజమాన్య హక్కులు కల్పించి క్రమబద్ధీకరించామని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. 22ఏ ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించిన ఆయన.. భూ దందాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త తరహా నాటకాలు ఆడుతోందని ఆరోపించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 76 జీవో కింద సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో 30 వేల మందికి పట్టాలు ఇచ్చి క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. సింగరేణి కార్మికుల కుటుంబాలతో పాటు కార్మికేతర కుటుంబాలకు కూడా పట్టాలు ఇచ్చామని, అనంతరం 29 జీవో ద్వారా మరికొంత మందికి పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. అప్పట్లో మిగిలిన వారికి ఇప్పుడు పట్టాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియ గొప్ప విషయమేమీ కాదన్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ పట్టాల విషయంలో కమిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త తరహా మోసానికి పాల్పడుతోందని విమర్శించారు. గోదావరిఖనిలో కూల్చివేసిన ఇళ్లు, దుకాణాల బాధితులకు న్యాయం చేయాలని, కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లో బాధితులందరికీ దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశా రు. లేదంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మేకల సమ్మయ్య యాదవ్, మురళీధర్‌రావు, మూల విజయరెడ్డి, పార్లపల్లి రవి, వాళ్ల హరీష్‌రెడ్డి, నూనె కొమరయ్య, జావిద్ పాషా పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ ఆర్ అండ్ ఆర్ పనులను వేగవంతం చేయాలి

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జగిత్యాల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ అటవీ భూముల పరిహారం ఆర్ అండ్ ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ అటవీ భూముల పరిహారం పునరావాసం పునరావాస పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ అటవీ భూముల పరిహారం ఆర్ అండ్ ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం 6 వేల కోట్ల రూపాయలు వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు ఇప్పటికే 1,050 కోట్ల రూపాయలు మరోసారి 1,500 కోట్ల రూపాయలు కలిపి మొత్తం 2,550 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమన్నారు జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు నిధులు సరిపోకపోయినా ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్ లో పెట్టవద్దని స్పష్టం చేశారు భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు ఇప్పటికే విడుదలైన 2,550 కోట్ల రూపాయలను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు కలెక్టర్లు ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు






రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ ఆర్ అండ్ ఆర్ పనులకు సంబంధించి సుమారు 3,101 కోట్ల రూపాయల విలువైన పనులు గుర్తించగా 2,504 కోట్ల రూపాయలు మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు 35.50 కోట్ల రూపాయలు కేటాయించగా ఇప్పటివరకు 8 కోట్ల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు మిగిలిన 27.50 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని మరో 10 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు ఎల్లంపల్లి ప్రాజెక్టు మెయిన్ కెనాల్ పనులకు 20 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ప్రస్తుతం పీడీ ప్రక్రియ పురోగతిలో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పరిహారం చెల్లింపులు ఇతర పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత ఆర్డిఓలు ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే పిల్లలు ఎదుగుదల

కోరుట్ల ఐసీడీఎస్ సూపర్ వైజర్ భారతి

కోరుట్ల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



సమతూల్య ఆహారం తీసుకోవడం ద్వారా చిన్నారుల్లో శారీరక మానసిక ఎదుగుదల మెరుగుపడటంతో పాటు పోషకాహార లోపాన్ని నివారించవచ్చని కోరుట్ల అంగన్వాడీ సూపర్వైజర్ భారతి అన్నారు జాతీయ పోషక మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోరుట్ల పట్టణంలోని 14వ వార్డు రహ్మత్‌పుర 2 అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆమె గర్భిణీలు బాలింతలు చిన్నారులు కిశోర బాలికలకు సమతుల్య ఆహారం పోషక విలువలు ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు శరీరానికి అవసరమైన వివిధ రకాల పోషకాలు అందేలా రోజువారీ ఆహారంలో ఆకుకూరలు కూరగాయలు పప్పుధాన్యాలు చిరు ధాన్యాలు పాలు తదితర పోషక పదార్థాలను భాగం చేసుకోవాలని సూచించారు చిన్నారుల ఎదుగుదల దశలో పోషకాహారం ఎంతో కీలకమని సరైన పోషకాలు అందకపోతే శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసంపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుందని వివరించారు క్యారెట్ బీట్‌రూట్ పప్పు పాలకూర ఇతర ఆకు కూరలు చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలని సూచించారు స్థానికంగా అందుబాటులో ఉండే పోషక పదార్థాలతోనే ఆరోగ్యకర మైన ఆహారాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు గర్భిణీలు బాలింతలు తమ ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యంపై శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని వివరించారు అదేవిధంగా బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన చిన్నారులు గర్భిణీలు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్ భారతి సూచించారు పోషకాహార లోపాన్ని గుర్తించి దానిని నివారించేందుకు తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు పిల్లల బరువు ఎదుగుదల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సూచనలు సలహాలను అంగన్వాడీ సిబ్బంది నుంచి తీసుకోవాలని తెలిపారు పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని చిన్నారులకు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చాలని సూచించారు జాతీయ పోషక మహోత్సవం ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పోషకాహార ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు దోహదపడతాయన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు చింత అరుణ కల్వకోట ప్రేమలత అంగన్వాడీ హెల్పర్లు చాంద్ సుల్తానా షాకేరా బేగం గర్భిణీలు బాలింతలు కిశోర బాలికలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరులో మహిళలతో ఘనంగా కుంకుమ పూజ,అన్న ప్రసాదం వితరణ

సెప్టెంబర్ 21,రాయికల్ (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చింతలూరు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా గ్రామ మహిళలతో కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ మంత్రోచ్చారణల మధ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మమ్మల్ని చల్లగా చూడు గణపయ్య"అంటూ స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వనిత రమేష్ మాజీ సర్పంచ్ వోరుగంటి మోహన్ రావు ఆలయ చైర్మన్ మక్కల సాయికుమార్ అనుపురం గంగాధర్ వార్డు సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

సెప్టెంబర్ 28 వరకు భగత్ సింగ్ జయంతి సభలు నిర్వహించాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)




భగత్ సింగ్ స్ఫూర్తితో యువతను చైతన్య పరిచి, ప్రజా సమస్యలపై పోరాటాలను బలోపేతం చేయాలని. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌టీపీసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 28 వరకు దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాల వారీగా భగత్ సింగ్ జయంతి సభలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భగత్ సింగ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సభలు, సమావేశాలు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యంగా యువతలో శాస్త్రీయ ఆలోచన, సామాజిక చైతన్యం పెంపొందించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. అవినీతి, ప్రజా సమస్యల నిర్లక్ష్యం, ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచే మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి, హక్కుల కోసం ఐక్యంగా పోరాడేలా యువతను సమీకరించాలని అన్నారు. భగత్ సింగ్ త్యాగం, ఆయన ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలవాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 28న భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సభలు నిర్వహించి, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రామన్న, గూడూరి వైకుంఠం, రాయమల్లు, నరసయ్య, రాజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణేశుని మండపం వద్ద ప్రత్యేక పూజలు

- మహా అన్నదానం
- ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల పట్టణ భీముని దుబ్బా ప్రాంతంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గణనాథుని దర్శించుకుని గణపతి హోమం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేసి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్లతో కలిసి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాద వితరణ చేపట్టారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ఆ గణనాథుని కృపా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ పలువురు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు భక్తులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథులను దర్శించుకున్నా మాజీ శాసన సభ్యులు దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మొట్లపల్లి, కాల్వ శ్రీరాంపూర్, పెగడపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను మాజీ శాసనసభ్యులు శ్రీ దాసరి మనోహర్ రెడ్డి గారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వారి వెంట మాజీ ఎంపీపీ సంపత్,మాజీ జడ్పీటీసీ తిరుపతి రెడ్డి, దేవయ్య,గొడుగు మల్లేష్,కొమరయ్య, యూత్ అధ్యక్షుడు కుమార్ యాదవ్,అల్లం సదయ్య,brs నాయకులు ఉన్నారు.

## అధిక ధరలకు మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

- జనతా వైన్స్‌పై మద్యం ప్రియుల ఆరోపణలు..
- అధికారులు స్పందించాలంటూ డిమాండ్

మంథని, సెప్టెంబర్ 21: వుదయం ప్రతినిధి



మంథని పట్టణంలోని జనతా వైన్స్‌లో నిర్ణీత ధరల కంటే అధికంగా మద్యం విక్రయిస్తున్నారని పలువురు మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. దుకాణంలో ధరల పట్టిక ఏర్పాటు చేసినప్పటికీ, అందులో పేర్కొన్న ధరలకు భిన్నంగా అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. దీంతో సామాన్యుల జేబులకు చిల్లు పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరల వసూళ్లపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని కోరుతున్నారు. ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ధరల పట్టికను కేవలం ప్రదర్శనకే పరిమితం చేయకుండా, దాని ప్రకారం విక్రయాలు జరుగుతున్నాయా లేదా నిరంతరం పర్యవేక్షించాలని కోరుతున్నారు. వినియోగదారుల నుంచి అధిక వసూళ్లకు అడ్డుకట్ట వేసి, పారదర్శకంగా మద్యం విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

## చదువులో ప్రతిభకు చేయూత

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)




మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ప్రైమరీ, హైస్కూల్‌లో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు చెరుకు నరసింహ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెరుకు మహేందర్ రెడ్డి చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించినట్లు వారు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు రూ.2,106, హైస్కూల్ విద్యార్థులకు రూ.5,800, ఇంటర్ విద్యార్థికి రూ.2,000, అనాథలు, వితంతువులకు రూ.15,000 చొప్పున మొత్తం రూ.24,906 విలువైన స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆర్థిక పరిస్థితులు చదువుకు ఆటంకంగా మారకూడదనే ఉద్దేశంతో ట్రస్ట్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారంపై విచారణకు మానవ హక్కుల కమిషన్ ఆదేశం

మంథని, సెప్టెంబర్ 21:

తన ఫోటోను ఉపయోగించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ నాయిని సంతోష్ చేసిన ఫిర్యాదుపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి భాద్యులపైన తగిన చర్యలు తీసుకోవాలని గోదావరిఖని ఏసీపీని కమిషన్ ఆదేశించింది. తన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయిని సంతోష్ పేర్కొన్నారు. ఇదే అంశంపై రూ.2 లక్షల పరువు నష్టం దావా కూడా న్యాయస్థానంలో దాఖలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు న్యాయం చేస్తారని ఆశిస్తున్నానని, వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే తప్పుడు ప్రచారాలపై చట్టపరంగా పోరాటం కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.



## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి , అశ్విని తానాజీ వాకడే, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, తదితర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 145 అర్జీలు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 37, కరీంనగర్ నగరపాలక కు32 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కుంకుమ పూజలో బీఆర్ఎస్ నాయకుడు

ముత్తారం సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి):

మండలంలోని ఓడేడ్ గ్రామ పంచాయతీ పరిధి రెండో వార్డు ఎస్టీ కాలనీలో సోమవారం గణపతి మండపం వద్ద నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు,ఓడేడ్ మాజీ ఎంపీటీసీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సామాజిక ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకలని పేర్కొన్నారు.గణపతి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## యూనియన్ బ్యాంక్ గృహ రుణాలు

ఇళ్ల నిర్మాణం, మరమ్మతులకు తక్కువ వడ్డీకే బ్యాంక్ రుణాలు

పెద్దపల్లి:సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేక గృహ రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.రీజినల్ హెడ్ కె. నటరాజ్ సూచనల మేరకు పెద్దపల్లి జెండా రోడ్డులోని బ్యాంకు శాఖలో ఈ పథకంపై ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రిటైల్ లోన్ విభాగం అధిపతి సంతోష్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో గృహ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఇంటి నిర్మాణంతో పాటు ఇళ్ల మరమ్మతులు,పునరుద్ధరణ పనులకు కూడా ఈ రుణ సదుపాయం వర్తిస్తుందని స్పష్టం చేశారు.ఆసక్తి ఉన్నవారు జన్-సమర్థ్ అంతర్జాల వేదిక ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.పూర్తి వివరాలు, అర్హతల కోసం సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను గానీ,రిటైల్ లోన్ విభాగాన్ని గానీ సంప్రదించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ వైకుంఠ రావు,బ్యాంకు సిబ్బంది,మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సురభి నవీన్ కుమార్

కోరుట్ల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా కోరుట్ల పట్టణ కార్గిల్ చౌక్ వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో బిజెపి కోరుట్ల పట్టణ కౌన్సిలర్లు సొరుపాక రమాదేవి రమేష్ కలాల రాధ సాయి చంద్ గుగ్లావత్ శ్రీకాంత్ కోరుట్ల పట్టణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కటుకం వినయ్ ముల్క ప్రసాద్ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల రవి పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు గుడ్ల మనోహర్ ఆడెపు నరేష్ బిజెపి పట్టణ మాజీ కౌన్సిలర్ పెండెం గణేష్ కస్తూరి జ్ఞానేశ్వర్ గుద్దేటి రాజేందర్ మర్రి నంద కిషోర్ గుండేటి సంజీవ్ ఎల్లాల నారాయణ రెడ్డి సాడిగే మహేష్ భారతీయ జనతా యువ మోర్చా జిల్లా నాయకులు పంబాల అజయ్ బిజెపి బిజేవైఎం వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఉచిత మెగా వైద్య శిబిరాలకు అనూహ్యస్పందన
- 500మందికి పైగా రోగులకు ఉచిత పరీక్షలు

(వుదయం ప్రతినిధి ) చిగురుమామిడి:




గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి నయం చేసుకునే అవకాశం ఉంటుందని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కందితిరుపతి రెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకట రమణారెడ్డి తెలిపారు.మండలంలోని సుందరగిరి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాలకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది.మెడికోవర్ హాస్పిటల్,డాక్టర్ శరత్ ఐ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరాల్లో దాదాపు 5వందల మంది ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.వరంగల్ మేడికోవర్ హాస్పిటల్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ షఫీ నేతృత్వంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు.ఈ క్యాంపులో దాదాపు 250మంది పేషెంట్లకు ఈసీజీ,థైరాయిడ్, షుగర్,బీపీ పరీక్షలను ఉచితంగా చేశారు.ఈ సందర్భంగా రోగులకు అవసరమైన ఉచిత సలహాలు,సూచనలు అందించారు.వరంగల్ డాక్టర్ శరత్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య దాదాపు 250మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.పరీక్షల అనంతరం కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని, ముఖ్యంగా కంటిపై పొర,శుక్లాలు ఉన్న రోగులను గుర్తించారు. వీరందరికీ త్వరలోనే ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెడబోయిన రాజు,సింగిల్ విండో డైరెక్టర్ శ్రీ రామోజు రాజ్ కుమార్, వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్,శ్రీమూర్తి శ్రీనివాస్,గిరబోయిన రవీందర్, ఎనగందుల రాజేశ్వరి,పెసరు ప్రమీల,ఆసుపత్రి సిబ్బంది అనూష, కోఆర్డినేటర్ మునిపట్ల సాగర్, కౌన్సిలర్ సందీప్, సదానందం,క్యాంపు కోఆర్డినేటర్ రవి,ప్రేమల, స్రవంతి తదితర వైద్య సిబ్బంది పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ నాయకుడు కిరణ్ నవదీప్ ను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)



మల్లాపూర్ మండలం సంఘం శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ పాతకాల మానస భర్త కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాతకాల కిరణ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది స్వగ్రామానికి చేరుకోగా సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కిరణ్ ను పరామర్శించారు అనంతరం పాతదామ్ రాజు పల్లి గ్రామానికి చెందిన రొండ్ల నారాయణ కొడుకు నవదీప్ అనారోగ్యాల గురై ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవ్వగా సోమవారం నవదీప్ ను పరామర్శించారు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు ఈపరామర్శలో మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య నాయకులు జలపతి రెడ్డి నల్ల రాజన్న ఆయా గ్రామాల సర్పంచ్లు మాజీ ఎంపిటిసి సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిద హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి సహకరించాలి

**మండప నిర్వాహకులతో ఎస్ఐ రవికుమార్ సమావేశం**




**ముత్తారం సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి):**

రాబోయే గణేష్ నిమజ్జన మహోత్సవాలను ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు ముత్తారం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జన వేడుకల సందర్భంగా పాటించాల్సిన భద్రతా చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన పలు సూచనలను నిర్వాహకులకు వివరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన ఊరేగింపులు క్రమశిక్షణతో నిర్వహించాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఊరేగింపుల సమయంలో ధ్వని కాలుష్య నియంత్రణతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.యువకులు ఉత్సాహం పేరుతో ప్రమాదకర విన్యాసాలకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సామరస్యపూర్వక వాతావరణంలో వేడుకలను నిర్వహించాలని,గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు మండప నిర్వాహకులు సహకరించాలని సూచించారు.గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో పోలీసు సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు,యువకులు పాల్గొన్నారు.

# ఖరీఫ్-2026 ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, సామగ్రి అందుబాటులో ఉండాలి**
- **ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

ఖరీఫ్–2026 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి ఖరీఫ్–2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ★జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఎంత మొత్తంలో ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందో,రైతుల విత్తన, సొంత అవసరాలకు మినహాయించి కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం వచ్చే అవకాశం ఉందో సమగ్ర అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం నిల్వకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ గోదాములను ఇతర అవసరాలకు వినియోగించే ముందు సంబంధిత అధికారులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని ఆదేశించారు. ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రణాళికను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మండలాల వారీగా పంట కోతల షెడ్యూల్‌కు అనుగుణంగా అవసరమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే సమయానికి రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎఫ్‌ఏక్యూ నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా రైతులకు ముందుగానే సూచనలు అందించాలని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎఫ్‌ఏక్యూ నాణ్యత ప్రమాణాలు, పరికరాల వినియోగం తదితర అంశాలపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎస్‌డబ్ల్యూసీ రీజినల్ మేనేజర్, సంబంధిత శాఖల అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మొద్దు

**సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్**



**కరీంనగర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాన్ షాప్ వ్యాపారస్తులతో జిల్లా న్యాయ సేవా సదన్ లో సమావేశం నిర్వహించారు ఇట్టి సమావేశంలో మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మవద్దని, అమ్మితే చట్ట ప్రకారము కఠిన చర్యలు కలవని తెలియజేశారు. కొందరు గంజాయిని చాక్లెట్ల రూపంలో విక్రయిస్తున్నారని వీటిపట్ల పాన్ షాప్ వ్యాపారస్తులు అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు, ఎవరైనా గంజాయి విక్రయించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్ కి తక్షణమే సమాచారం అందించి దేశానికి మరియు యువతరానికి మంచి భవిష్యత్తును అందించేందుకు కృషి చేయాలని తెలియజేశారు, గంజాయి విక్రయించిన, సరఫరా చేసిన, సేవించిన కఠిన శిక్షలు కలవని తెలియజేశారు., పాన్ టేల వ్యాపారస్తులు గంజాయిని నిర్మూలించడంలో ముఖ్య పాత్ర వహించాలని కోరారు. ఇట్టి సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ తో పాటు డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, న్యాయవాది సిద్ధికి, కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్, 3 టౌన్ ఎస్ఐ లు, మరియు పార్టీల వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **గ్రామంలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి**
- **కోతులు,కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి**
- **ఎంపీఓలతో ,డిఎల్పిఓలతో గ్రామీణ పారిశుధ్య నిర్వహణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామంలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎంపీవోలతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్తా చెదారం పేరుకుపోకుండా, రోడ్లు, వీధులు, డ్రైనేజీలు, తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని, చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి నిర్ణీత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. మురుగు కాలువల్లో చెత్త, పూడిక పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరిచేలా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద,కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కోతుల, కుక్కల వల్ల ప్రజలు ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోతుల, కుక్కల బెడద ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కోతుల బెడద నివారణకు అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి నాణ్యతను నిర్ధారించాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో తప్పనిసరిగా క్లోరినేషన్ నిర్వహించాలని, క్లోరిన్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించి నమోదు చేయాలని ఆదేశించారు.

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. దోమల నివారణకు నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి శుభ్రపరచాలని, గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ప్రజలకు పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, వాహనాలను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎంపీవోలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, కోతుల, కుక్కల బెడద తదితర సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీమాల, ఎంపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తొలి మలిదశ ఉద్యమాలలో మార్గదర్శిగా నిలిచి అలుపెరగని పోరాటం చేసిన యోధుడు దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా సోమవారం నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ టిఆర్ఎస్ బిజెపి బిఆర్ఎస్ తదితర పార్టీ నాయకులతో కలిసి బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈకార్యక్రమంలో స్థానిక పద్మశాలి సంఘం నాయకులు అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

**మల్లాపూర్ సెప్టెంబర్ 21 (వుదయం విలేకరి)**

కోరుట్ల నియోజకవర్గంలోని మల్లాపూర్ మండలం పాతదాంరాజ్ పల్లి గ్రామానికి చెందిన ఇరువురు ఇటీవల మృతి చెందగా సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర జువ్వాడి కృష్ణారావు ఆయా గ్రామాల్లోని బాధిత కుటుంబ సభ్యులు దానపెల్లి రమేష్ బండారు ఎల్లయ్య మండల కేంద్రమైన మల్లాపూర్ కు చెందిన గడ్డం మల్లారెడ్డి తండ్రి రాజారెడ్డి ఇటీవల మృతిచెందగా ఆయా కుటుంబాలను పరామర్శించారు ఈ పరామర్శలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లల జలపతి రెడ్డి మాజీ ఎంపిపి నల్ల రాజన్న ఆయా గ్రామాల సర్పంచ్లు మాజీ ఎంపీటీసీ సభ్యులు మాజీ సర్పంచ్లు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో అనామలీస్ నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి**
- **ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలి**
- **విచారణ ప్రక్రియను పారదర్శకంగా నిబంధనల ప్రకారం నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎన్నికల అధికారి**

**జగిత్యాల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్ నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు అనామలీస్ నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ పంపిణీ విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫారమ్ 6 7 8ల పరిష్కారాన్ని చివరి నిమిషం వరకు వాయిదా వేయకుండా తొందరగా పరిష్కరించాలని ఆదేశించారు అక్టోబర్ 25 లోపు అన్ని పనులు పూర్తి చేసుకోవాలని ఆఖరి 10 రోజులు చివరి క్షణం సవరణల కొరకు కేటాయించాలని కోరారు ఫారం 6 తో డిక్లరేషన్ ఫారం తప్పకుండా ఇవ్వడం తప్పనిసరి అని నోటీస్ లు బిఎల్ఓ లు మాత్రమే పంపిణీ చెయ్యాలని బిఎల్ఏ లని పంపిణీలో పాల్గొననివ్వద్దు అని ఆదేశించారు వయోవృద్ధులకు అంగ వైకల్యం కలవారు విదేశాల్లో లో ఉన్న వారి తరపున వారీ కుటుంబ సభ్యులు హియరింగ్ కి హాజరయ్యి సంబంధిత డాక్యుమెంట్స్ ఇవ్వగలరని తెలిజేశారు వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు

బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు నోటీసుల జారీ విచారణ దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని చివరి దశలో పనులు పేరుకుపోకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ సూచించారు ఎస్ఐఆర్–2026 ప్రక్రియను పారదర్శకంగా పకడ్బందీగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత ఆర్డీవోలు మున్సిపల్ కమిషనర్ లు ఎన్నికల అధికారులు సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# సర్‌పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**
- **ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి**
- **అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధాన ఎన్నికల అధికారి**

**పెద్దపల్లి, సెప్టెంబర్-21 (వుదయం ప్రతినిధి)**




ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, వీటి పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం–6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఎస్ఐఆర్–2026కు సంబంధించిన అన్ని పనులను 25-10-2026లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు. ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఫారం–6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, బీఎల్ఏలను నోటీసుల పంపిణీ ప్రక్రియలో పాల్గొననివ్వకూడదని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, చివరి దశలో పనులు పేరుకుపోకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో, ఏఈఆర్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**ధర్మపురి,సెప్టెంబర్ 21(వు దయం ప్రతినిధి):**



మండలంలోని రాయపట్నం గ్రామంలోని శివాలయం నందు గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకుని సోమవారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్య నారాయణ వ్రతాలు నిర్వహిం చారు.గణపతి నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణ మంతా శివ నామస్మరణతో పాటు వినాయక నామస్మరణతో మార్మోగింది. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో గ్రామస్థు లు,భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహం గా పాల్గొని సత్య నారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు.లోకకల్యాణం కోరుతూ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో దంపతులు భక్తిభావంతో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రుల య్యారు.మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ గణపతిని దర్శించు కుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు.వారి వెంట సర్పంచ్ రాందేని.మొగిలి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుముల.లక్ష్మణ్,కమిటీ సభ్యులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రుల వేళ గ్రామం లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించ డం వల్ల ప్రజల మధ్య ఐక్యత, సుఖ శాంతులు వెల్లివిరుస్తాయని తెలిపా రు.ప్రధాన అర్చకులు సురేష్ శర్మ వేదమంత్రో చ్చారణలతో,శాస్త్రోక్తంగా వ్రత విధు లను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదా లు అందజేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు సివిల్స్ ఉచిత శిక్షణ

- **జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. సంగీత**
- **యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష–2027కు ఉచిత శిక్షణ**
- **23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

**పెద్దపల్లి, సెప్టెంబర్-21 (వుదయం ప్రతినిధి)**



యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష–2027కు సన్నద్ధమవుతున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శ్రీ రామ్స్ ఐఏఎస్ కోచింగ్ సంస్థ సహకారంతో రెసిడెన్షియల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ అందించనున్నట్లు, ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక, ఉచిత శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్షల ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష–2027కు సన్నద్ధమవుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదు శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు welfare.sriramsias.com వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సెప్టెంబర్ 23 సాయంత్రం 6.00 గంటల వరకు సమర్పించవచ్చని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. సంగీత తెలిపారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9121087421 ఫోన్ నంబర్‌ను ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సంప్రదించవచ్చని, అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్ట్రేంజర్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం విజయవంతం



**రామడుగు, 21 సెప్టెంబర్ (వు దయంప్రతినిధి)**

రామడుగుమండల కేంద్రంలో స్ట్రేంజర్స్ యూత్ క్లబ్ వారి ఆధ్వర్యంలో విగ్రహధాత స్థానిక 7వ వార్డు సభ్యులు ఎండీ ఆరీఫ్ కుల మతాలకుఅతీతంగాఅన్నదానం,కుంకుమపూజకార్యక్రమాన్నినిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొప్పదండి శాసనసభ్యులు డా.మేడిపల్లి సత్యంహాజరయ్యి తీర్థ ప్రసాదాలు స్వీకరించా రు.ఈకార్యక్రమంలో సర్పంచ్, మహమ్మద్ మోయిజ్ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.కుల మతాలకు అతీతంగా ఇట్టి మహోత్తర దైవ కార్యాన్ని చేపట్టిన ఎండీ ఆరీఫ్ కు స్ట్రేంజర్స్ యూత్ క్లబ్ రామడుగు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలు

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 21 (వుదయం న్యూస్):**

పట్టణంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలను స్థానిక ఐబీ ఆవరణంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నిత్యం ప్రజాసేవలో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.ముఖ్యమంత్రికి నియోజకవర్గ సమస్యలను విన్నవిస్తూ, కోట్ల నిధులను నియోజకవర్గానికి తీసుకోవచ్చి అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.రాబోయే రోజుల్లో మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆయురారోగ్యాలతో ఉండాలని, ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని మనసారా ఆకాంక్షించారు.

అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, జెండా వెంకటాపూర్ పీఏసీఎస్ చైర్మన్ చల్ల నాగభూషణం, జిల్లా ఆర్టిఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి నరసయ్య, మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమేల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు,గుల్ల కోట పీఏసీఎస్ చైర్మన్ పెయ్యాల దేవేందర్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవాబ్ ఖాన్, నాయకులు చింత అశోక్ కుమార్, చిన్నా రమేష్, అన్వర్ ఖాన్, సురేష్ నాయక్, గుత్తికొండ శ్రీధర్, మస్రతుల్లా, హఫీజ్, హాజీ, రాందేని చిన్న వెంకటేష్, పెట్టెం మల్లికార్జున్, మండల నాయకులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ కే పి లో ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాలు

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి)**



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో గల వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండలి వద్ద , గంగా కాలనీ వద్ద, భగత్ సింగ్ నగర్ హాట్స్ ఏరియాలో, ఏ జోన్ ఏరియాలో, ఆర్కే వన్ మార్కెట్ ఏరియాలలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పట్టణ ఎస్సై జాడి శ్రీధర్,మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి, డాక్టర్ రాజా రమేష్, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్, బొమ్మ భూమయ్య గౌడ్ లు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ గణపతి మండలి ల నిర్వాహకులు మాట్లాడుతూ.. వినాయక స్వామివారి కృపతో ప్రతి సంవత్సరం వినాయక మండలి ల ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గణపతి మండలి ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**జిల్లా ఎస్పీ నితికా పంత్**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని,వాటికి చట్టపరమైన పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ కి నేరుగా వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ సావధానంగా విని,సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా, నిర్ణీత సమయంలో చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ అందిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

బెజ్జూరు మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ నేత స్వాతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సామల తిరుపతి మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి లో 1915 సెప్టెంబర్ 27న జన్మించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలు అందించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాటం చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం జరిగిందన్నారు. 2012 సెప్టెంబర్ 21న హైదరాబాదులో మరణించడం జరిగిందని ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సామల తిరుపతి ,ప్రధాన కార్యదర్శి కుసుకుట్ల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు కుసుకుట్ల శ్రీనివాస్, ఇట్టిగాల శ్రీనివాస్, పరుస గణేష్ ,పర్స రమేష్ ,సామల వెంకటేష్ ,ఉప్పకాయల శంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించిన దండేపల్లి పోలీసులు

**దండేపల్లి: సెప్టెంబర్ 21 (వుదయం విలేకరి)**

దండేపల్లి మండలం గూడెం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని సురక్షితంగా రక్షించారు దండేపల్లి పోలీసులు. వివరాల్లోకి వెళితే జన్నారం మండలం బాదంపల్లి గ్రామానికి చెందిన తిప్పని సతీష్ దండేపల్లి మండలం గూడెం బ్రిడ్జి వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న వెంటనే దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ స్పందించి,స్థానిక ఈతగాళ్ల సహాయంతో గోదావరి నదిలో గాలింపు చేపట్టి,సతీష్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. తక్షణ స్పందనతో పోలీసులు మరియు స్థానిక ఈతగాళ్లు సమన్వయంతో వ్యవహరించి వ్యక్తి ప్రాణాలను కాపాడారు. దండేపల్లి పోలీసులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పెట్టం శేఖర్ ఉన్నారు.



## పీఎస్ఆర్ జన్మదిన వేడుకలు.. విద్యార్థులతో ఆత్మీయంగా!



**మంచిర్యాల /రామకృష్ణాపూర్ /సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి)**

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తన జన్మదిన వేడుకలను విద్యార్థులతో కలిసి ఆత్మీయంగా జరుపుకున్నారు. మంచిర్యాల బాయ్స్ హైస్కూల్‌లో సెంట్రల్‌లైట్ కిచెన్ ద్వారా అందిస్తున్న ఉచిత అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. విద్యార్థులతో గడిపిన ఈ రోజు తన జీవితంలో మరపురాని రోజుగా నిలిచిపోతుందన్నారు.కార్యక్రమంలో మేయర్ దర్శ మధుకర్, డిప్యూటీ మేయర్ నల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఆసిఫాబాద్ జిల్లా న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ తెలిపారు. మే.2022న మధ్యాహ్నం బాలిక ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా,అదే గ్రామానికి చెందిన వడ్డురే హనుమంతు (వయస్సు 66 సంవత్సరాలు), తండ్రి చంద్రు అనే వ్యక్తి బాలికకు రూ.50 చూపించి దుకాణానికి తీసుకెళ్తానని చెప్పి,అనంతరం మాయమాటలు చెప్పి తన ఇంటి వైపు తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని నిందితుడి ఇంటి సమీపంలో ఉన్న ఓ మహిళ గమనించారు.కొద్దిసేపటి తర్వాత నిందితుడి ఇంటి నుంచి బాలిక అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని నిందితుడిని బయటకు తీసుకువచ్చారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వాంకిడి ఎస్సై లావణ్య కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి డీఎస్పీ శ్రీనివాస్ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో అభియోగ పత్రం (చార్జిషీట్) దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన ఆసిఫాబాద్ జిల్లా న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి శారదా దేవి నిందితుడికి పోక్సో చట్టం సెక్షన్ -10 కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రభుత్వ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శ్రీనివాస్ 11 మంది సాక్షులను కోర్టులో హాజరు పరిచి వాదనలు వినిపించారు.కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జె. బాల్ సింగ్, సీడీఓ రాంసింగ్,ధనరాజ్ సమర్థవంతంగా సమన్వయం చేస్తూ కేసు పురోగతికి సహకరించారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సేకరించి, సమగ్రంగా దర్యాప్తు పూర్తి చేసి,నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పిపి ఎమ్. శ్రీనివాస్ ,ప్రస్తుత ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్,ప్రస్తుత వాంకిడి సీఐ ఎస్. వేణుగోపాల్,ఎస్సై డి. మహేందర్,కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీ కె. బాల్ సింగ్, సబ్ డివిజన్ సీడీఓ రాంసింగ్, ధనరాజ్ , భరోసా అడ్వకేట్ శైలజ,అలాగే సాక్షులను సమన్వయం చేసి గౌరవ న్యాయస్థానంలో సకాలంలో హాజరు పరిచిన పోలీసు అధికారులను మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ అభినందించారు.



నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్,ఐపీఎస్ తెలిపారు.

## 16 ఏళ్లుగా వినాయక ప్రతిష్ట భక్తులకు 80 కిలోల పులిహోర పంపిణీ

**నల్లపు నీరజ సోమన్న దంపతులు**

**నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 21**

నర్సంపేట పట్టణంలోని మూడో వార్డులో నల్లపు నీరజ–సోమన్న దంపతులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 16 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వినాయకుడిని ప్రతిష్ఠిస్తూ భక్తితో పూజలు నిర్వహిస్తున్నామని దంపతులు తెలిపారు. గణపతి నవరాత్రుల సందర్భంగా వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు నల్లపు నీరజ–సోమన్న దంపతులు తమ స్వంత ఖర్చులతో 80 కిలోల పులిహోరను ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని సంకల్పంతో ప్రతియేటా వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నామని దంపతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు వారి సేవాభావాన్ని అభినందించారు.





## భూలక్ష్మి మందిరం వద్ద షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

- గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సహకారంతో నిర్మాణం
- గ్రామస్తులకు ఉపయోగకరంగా షెడ్డు
- సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్

**నిజాంసాగర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి) :**

నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో భూలక్ష్మి మందిరం నిర్మాణం వద్ద షెడ్డు నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సహకారంతో ఈ షెడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూలక్ష్మి మందిరం వద్ద షెడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అందిస్తున్న సహకారంతో నిర్మాణ పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. షెడ్డు పూర్తయిన తర్వాత గ్రామస్తులకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షెడ్డు నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేంగారం కవిత పండరి, ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షుడు గుర్రపు వెంకటేశం, సాయిలు, రాజు, గంగారం, రాములు, అంజయ్య, హనుమయ్యతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**

**నిర్మల్ జిల్లా 20 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మామునూరు విమానా శ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

**రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వరంగల్ జిల్లా కార్యదర్శి. వల్లందాస్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞ**

**పర్వతగిరి , సెప్టెంబర్ 21 ( వుదయం ప్రతినిధి ):**

మామునూరు లో నిర్మించనున్న విమానా శ్రయానికి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని. రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వరంగల్ జిల్లా కార్యదర్శి. వల్లందాస్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్(3) ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. ముఖ్యమైన నగరాలలో వరంగల్ కు. చరిత్ర ఆత్మకంగా ప్రాధాన్యత ఉండడమే కాకుండా కాకతీయ కాలంలో రాజధానిగా ప్రత్యేక గుర్తింపు వరంగల్ కు. ఉందా అని అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్త న్యాయవేత్తగా భారత రాజ్యాంగ రూపకల్పిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు. ప్రత్యేక గుర్తింపు ఉంది మామునూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు అంతేకాకుండా విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టే ప్రతిb పాదనలకు మేధావులు విద్యావేత్తలు అధికారులు ప్రజాప్రతినిధులు అంబేద్కర్ ను.ఆదర్శంగా తీసుకుంటున్న వారు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు ఈ ఈ సమావేశంలో జేరుపోతుల శ్రీనివాస్. పసుల కుమార స్వామి పాల్గొన్నారు.

## మహాదేవపూర్ మండలంపై మంత్రి చిన్నచూపు

- అగ్ని మాపక కేంద్రం ప్రారంభోత్సవంలో జాప్యం దేనికి?
- మా సారు ముఖ్యమంత్రి తర్వాత అంతా తనే నని అంటుండ్రు
- సినరేజ్ ఫండ్ ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి
- ఫైర్ స్టేషన్ ప్రారంభోత్సవం కొరకై బీఆర్ఎస్ పార్టీ నిరసన

**జయశంకర్ భూపాలపల్లి:**
**సెప్టెంబర్ 21(వుదయం జిల్లా ప్రతినిధి):**

మహాదేవపూర్ మండలంపై మంత్రి చిన్నచూపు చూస్తున్నారని మా సారు ముఖ్యమంత్రి తర్వాత అంతా తనే నని కాంగ్రెస్ నాయకులు అంటుండ్రు కానీ మహాదేవపూర్ మండల సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదంటూ మంత్రిపై బి ఆర్ ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మంథని నియోజకవర్గ మాజీ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత,ఆరోపించారు మహాదేవపూర్ మండల కేంద్రానికి అగ్ని మాపక కేంద్రం మంజూరై ఆరు నెలలైనా,ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ప్రారంభించాక పోవడంలో మంత్రి శ్రీధర్ బాబు మతలబు ఏంటో? ఇక్కడి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.మంత్రి కి పాలన మీద గుర్తుకు రావాలని ఫైర్ స్టేషన్ ప్రారంభోత్సవానికి కొబ్బరి కాయ కొట్టి తమ నిరసన తెలియజేశారు.ఎందుకు మహాదేవపూర్ మండల ప్రజలను చిన్నచూపు చూస్తున్నారో తెలుపాలని,అదే భూపాలపల్లి,కాటారం లోనే ఈ అగ్ని మాపక కేంద్రం మంజూరై ఉంటే ఇదివరకే ప్రారంభోత్సవం చేసేవారని ఎద్దేవా చేశారు. మహాదేవపూర్ మండల ప్రజలారా! ఒక్కసారి ఆలోచించండి.ఓటు వేసే తప్పుడు ఆలోచించకపోతే ఐదు ఏండ్లు మనం బాధ పడాల్సి వస్తుందని,ఎన్నికలు వస్తే మాయ మాటలు చెప్పి,ఓటుతో అధికారంలోకి వచ్చాక ఐదు సంవత్సరాలు ప్రజలను పట్టించుకోవడమే కాంగ్రెస్ పార్టీ నైజమని గుర్తించుకోవాలని అన్నారు. మహాదేవపూర్ మండలంలో మీ పాలన కుంటుపడి అనేక సమస్యలు ఉన్నాయని,మీరు మా మండలానికి వస్తే ప్రజల నుండి దరఖాస్తులు తీసుకొనే పరిస్థితి లేదని,ఇక్కడ ఉండే కాంగ్రెస్ నాయకులే దరఖాస్తులు తీసుకొనివ్వరని,వందల మంది పోలీసులతో మీరు వస్తారని,మిమ్మల్ని కలవడానికే మహాదేవపూర్ మండల ప్రజలు భయపడుతున్నారని,మీకు ప్రజలు ఓటు వేసి అధికారం ఇచ్చింది,మమ్మల్ని భయ భ్రాంతులకు గురిచేయడానికి కాదు అన్నది గుర్తెరుగాలని అన్నారు. మహాదేవపూర్ మండలంలో అనేకంగా ఇసుక క్యారీలు నడుస్తున్నాయని,వందల లారీలు రోడ్లపైకి వస్తున్నాయని,ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని,మీరు ఎమ్మెల్యే గా ఉన్నపుడు మా ప్రభుత్వం వస్తె ఇసుక లారీలను బంద్ చేస్తామని మాట ఇచ్చారని,ఎప్పుడూ ఏమైందని అన్నారు.ఈ మండలంలో చాలా గ్రామాలకు సినరేజ్ ఫండ్ వస్తుందని,34 నెలలైనా సినరెజ్ ఫండ్ ఇవ్వడం లేదని,మా సారు ముఖ్యమంత్రి తర్వాత అంతా తనే నని మీ కాంగ్రెస్ నాయకులే చెపుతూ ఉంటారని,ఐనా సినరెజ్ ఫండ్ ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని, మహాదేవపూర్ మండల సర్పంచ్ లారా మేల్కొండి?ఇకనైనా మీ సారు ను అడిగి సినరెజ్ ఫండ్ తీసుకరండి గ్రామాల్లో అభివృధి కార్యక్రమాలు చేపట్టండి.లేకపోతే ప్రజలే మీకు తగిన గుణపాఠం చెపుతారని అన్నారు.



ఫైర్ స్టేషన్ మంజూరై ఆరు నెలలైనా నీటి ట్యాంకులు,లారీలు,సిబ్బంది లేరని,40 ఏండ్లుగా ఒకే కుటుంబానికి అధికారం ఇస్తే, మహాదేవపూర్ మండలం అంటే మీకు అందుకు చిన్నచూపో మాకు అర్థం కావట్లేదని,ఓటు వేస్తున్నందుకేనా? ప్రజలు ఆలోచించాలని,ప్రారంభోత్సవం చేయకుండా కాలక్షేపం చేయడం దేనికని,ఎక్కడ వసతులు లేవని చెప్పి పక్క మండలానికి తరలించుకపోవడమేనా మీ ఉద్దేశ్యమని అనిపిస్తుందని,వెంటనే ఫైర్ స్టేషన్ ప్రారంభించి,ఐదు మండలాల ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని,గతంలో కూడా మహాదేవపూర్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు కాటారం తరలించారని,ఈ మండలం మీద ఎందుకింత వివక్ష అని అన్నారు.మేధావులారా ఆలోచించండి అని ఈ మండలానికి మంజూరైన ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడే కొనసాగించేలా ఒత్తిడి తెద్దామని,లేకపోతే మండలం యొక్క అస్తిత్వం కోల్పోయే ప్రమాదం,ఇక్కడి పరిస్థితి మీద భవిష్యత్తు తరాలకు ప్రమాదం పొంచివుందని అన్నారు. మహాదేవపూర్ కు మంజూరైన కోర్టు ఇక్కడే ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతామని,కోర్టు మా హక్కుగా నిరసనలు,ధర్నాలు,నిరహార దీక్షలు చేపడతామని అన్నారు.ఇకనైనా కండ్లు తెరవాలని,వెంటనే ఫైర్ స్టేషన్ ప్రారంభోత్సవం చేయాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో మండల యూత్ మాజీ అధ్యక్షుడు అలీం ఖాన్,ఒడేటి రవీందర్,పోతవెంకటస్వామి,వెన్నంపల్లి మహేష్,సిరంగి రవీందర్,జక్కయ్య,లింగాల రామయ్య, సుంకె మధు,మురుకుట్టి రాజు, రెవెల్లి రాజశేఖర్,చిల్ల కుమార్,కడార్ల శంకర్,కాళేశ్వరం వార్డు సభ్యులు మహేష్,కొట్టే రవీందర్,కుంట్లం రాజేందర్,భాస్కర్,ఇమ్మడి శెట్టి రాజేందర్,రవి,చేకూర్తి శ్రీనివాస్, సమ్మయ్య, అడప మల్లయ్య,తోట మనోజ్,శ్రీపతి అర్జున్, తుంగల మధుకర్,కారెంగుల బాపురావు, సారయ్య,లింగాల కోటయ్య,మహేష్, మహేందర్, సతీష్,చిలుక రమేష్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అనంతగిరి, సెప్టెంబర్ 21 వుదయం**

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో నేడు ఉదయం 11:30 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో అందిన స్మార్ట్ రేషన్ కార్డులను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అనంతగిరి మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముస్కు శ్రీనివాస్ రెడ్డి కోరారు.



## నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మునగాల, సెప్టెంబర్ 22 (వుదయం):-**

మండల పరిధిలోని బరాకతి గూడెం గ్రామంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. ఈ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరుకావాలని తహసీల్దార్ సరిత సూచించారు.

## అటవీ భూమిలో అక్రమ నిర్మాణం.. చెట్ల నరికివేతపై ఫిర్యాదు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

గుడిహత్నూర్ మండలం ఉమ్రి (బి)లోని శ్రీరామ మందిరం సమీపంలో అటవీ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ శ్రీరామ మందిరం పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్రకు చెందిన అర్జున్ నారాయణ్ హల్నోర్ అలియాస్ అర్జున్ శాస్త్రి అటవీ శాఖ అనుమతులు లేకుండా శాశ్వత నిర్మాణం చేపడుతున్నారని, విలువైన చెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. అలాగే జేసీబీలతో అటవీ ప్రాంతంలో మొరం, కంకర తవ్వకాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎఫ్ఆర్‌వోతో క్షేత్రస్థాయి పరిశీలన చేయించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు. అటవీ భూమిని స్వాధీనం చేసుకుని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆలయ పూజారి కోట్నాక్ రాము మహారాజ్, ఉమ్రి (బి) సర్పంచ్ అర్క భారత్‌కుమార్, సోయంగూడ సర్పంచ్ ఉర్వేత బాపురావు, సూర్యగూడ సర్పంచ్ షేక్ నాజియా–రహీం, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిదాం జంగు పటేల్, మాజీ సర్పంచ్ సోయాం బోజ్జు తదితరులు ఉన్నారు.




## ఆదివాసీ యువత ఎవరెస్ట్ యాత్రకు సీతక్క చేయూత

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్రకు సిద్ధమైన ఆదివాసీ యువతకు మంత్రి సీతక్క చేయూతనందించారు. ఈనెల 23న యాత్రకు బయలుదేరనున్న మడావి కన్ని బాయి (కుమ్రం భీమ్ ఆసిఫాబాద్), కాత్లే ఆనంద్‌రావు (ఆదిలాబాద్) సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా సీతక్క బృంద సభ్యులను ఆప్యాయంగా పలకరించి, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తన వంతుగా వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించారు. యాత్రను విజయవంతంగా పూర్తి చేసి తిరిగి వస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు బృంద సభ్యులు తెలిపారు. ఆదివాసీ యువత పర్వత శిఖరాలతోపాటు జీవితంలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీతక్క ఆకాంక్షించారు. కార్యక్రమంలో PVTG PSRJ ఆదిలాబాద్ అడ్వెంచర్ క్లబ్, ఆదివాసీ ఇన్‌ఫ్లుయెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## వివిధ సమస్యలపై ప్రజావాణికి 8 దరఖాస్తులు

**ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**

**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి)**

బెజ్జూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై 8 దరఖాస్తులు వచ్చినట్లు నోడల్ అధికారి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేసి సంబంధిత అధికారులకు అందచేయడం జరుగుతుందని ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రజావాణి పారదర్శకంగా జవాబు దారి తో నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 13 మంది అధికారులు హాజరైనట్లు తెలిపారు.

